పలు గ్రామాల్లో వనమహోత్సం

కుభీర్ : మండల కేంద్రమైన కుభీర్‌తో పాటు పార్డి(బి), విరేగాం, హల్ద గ్రామాల్లో శుక్రవారం మండల ప్రత్యేక అధికారి మనోహర్, పంచాయతీ అధికారి అసూరి గోవర్ధన్ వన మహోత్సవంలో భాగంగా ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ అన్ని చోట్ల మొక్కలు పెంచేలా కృషి చేయాలన్నారు. విరేగాం గ్రామంలో పంచాయతీ రికార్డులను పరిశీలించారు. వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకొని మురికి కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కార్యదర్శికి సూచించారు. అనంతరం కుభీర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట హెచ్‌ఎం నారాయణరెడ్డి, ఉపాధి హామీ టీఏ మహేష్ ఉన్నారు.



మెగా డీఎస్సీ ప్రకటించాలి

నవతెలంగాణ-కెరమెరి

డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలని మాలి మహా సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి లింగురే బాలాజీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాలీ సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి మెగా డీఎస్సీ నిర్వహించాలన్నారు. ఇటీవల పదోన్నతుల వల్ల అనేక పోస్టులు ఖాళీ అయ్యాయన్నారు. అధికారంలోకి వస్తే నిరుద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని, మెగా డీఎస్సీతో టీచర్ల పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి 25వేల టీచర్ల భర్తీకి(డీఎస్సికి) రీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. ప్రమోషన్ల ద్వారా జిల్లాలో కొత్తగా ఏర్పడిన ఉపాధ్యాయ ఖాళీలను 2023 పాత డీఎస్సీలో కలిపి పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. జూన్‌లో టెట్ ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులను దృష్టిలో ఉంచుకొని వారికి సమయం కేటాయిస్తూ డీఎస్సీని మూడు నెలలు వాయిదా వేసి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాలీ సంఘం మాజీ మండల అధ్యక్షుడు వాడై సుభాష్, సోనాజీ, ప్రకాష్ పాల్గొన్నారు.

రైతు భరోసా ఎప్పుడు..?

- ఆశగా ఎదురుచూస్తున్న అన్నదాతలు
- ప్రామాణికంపై అభిప్రాయాలు సేకరిస్తున్న ప్రభుత్వం
- జాప్యం జరుగుతుండటంతో ఆర్థిక ఇబ్బందులు
- కౌలు రైతుల్లో అయోమయం

అన్నదాతలకు పెట్టుబడి సాయం కింద అందజేసే రైతు భరోసా నిధులు ఆలస్యమవుతున్నాయి. ప్రభుత్వం ఈ పథకంలో భాగంగా కొత్త మార్గదర్శకాలు రూపొందించే పనిలో ఉండటంతో అన్నదాతలకు పెట్టుబడి సాయంలో జాప్యం జరుగుతోంది. ఇప్పటికే విత్తనాలు విత్తడం పూర్తయినప్పటికీ ఇంకా సాయం అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతు భరోసా పథకం ఎవరికి వర్తింపజేయాలి.. ఎన్ని ఎకరాల వరకు అందజేయాలి..వేటిని ప్రామాణికంగా తీసుకోవాలి..తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో అభిప్రాయాలు సేకరిస్తోంది. ఈ ప్రక్రియలో జాప్యం చోటుచేసుకోవడం అన్నదాతలను కలవర పెడుతోంది. మరోపక్క కౌలు రైతులకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో వారిలో అయోమయం నెలకొంది. ప్రభుత్వం హామీ నెరవేరస్తుందా లేదా అనే ఆందోళన వ్యక్తమవుతోంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అన్నదాతలకు ఆర్థిక భరోసా అందించేందుకు ప్రభుత్వం ప్రతి ఏటా పెట్టుబడి సాయం అందజేస్తోంది. గత ప్రభుత్వం రైతుబంధు పేరిట ఈ పథకం అమలు చేయగా.. కొత్తగా వచ్చిన ప్రభుత్వం పేరు మార్చి రైతుభరోసా పేరిట అమలుకు శ్రీకారం చుట్టింది. కానీ గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా పన్నులు చెల్లించేవారు, ప్రభుత్వ ఉద్యోగులు, కీలక ప్రజాప్రతినిధులు, పెద్ద రైతులతో పాటు సాగులో లేని భూములను ఈ పథకం నుంచి తప్పించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. వీరిని తొలగిస్తే నిధులు భారీగా మిగిలే అవకాశం ఉంటుంది. ఐదు నుంచి పది ఎకరాల వరకు వర్తింపజేయాలని భావిస్తుండటంతో క్షేత్రస్థాయిలో పరిశీలన కోసం రాష్ట్రస్థాయిలో మంత్రివర్గ ఉప సంఘం నియమించింది. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో ప్రజలు, సహకార సంఘాలతో పాటు వివిధవర్గాల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతోనే రైతు భరోసా నిధుల విడుదలలో జాప్యం జరుగుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆలస్యంతో ఆర్థిక ఇబ్బందులు

ప్రతి ఏటా ఖరీఫ్ ప్రారంభంలో ప్రభుత్వం ఈ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. కానీ గత ఏడాది నుంచి ఈ నిధుల విడుదలలో జాప్యం జరుగుతూ వస్తోంది. మరోపక్క రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడటం.. ఈ పథకాన్ని సవరించాలని నిర్ణయించుకోవడంతో ఈ ఏడాది కూడా జాప్యానికి కారణమవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పెట్టుబడిసాయాన్ని రూ.10వేల నుంచి ఏడాదికి ఎకరానికి రూ.15వేల చొప్పున అందించాలని భావిస్తోంది. ఖరీఫ్‌లో ఎకరానికి రూ.7500, రబీ సీజన్‌లో మరో రూ.7500చొప్పున రెండు విడతల్లో ఈ సాయం అందించనుంది. కాగా ప్రతిఏటా జూన్‌లో రావాల్సిన ఈ నిధులు జులై వచ్చినా ఖాతాల్లో జమ కాకపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విత్తనాల కొనుగోలుకు అప్పులు తీసుకొచ్చిన రైతులు వీటిని చెల్లించేందుకు తంటాలు పడుతున్నట్లు తెలుస్తోంది.

కౌలు రైతుల్లో అయోమయం

ఉమ్మడి జిల్లాలో అసలు రైతులతో పాటు కౌలు రైతులు సైతం అనేక మంది వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్నారు. గత ప్రభుత్వం వీరిని ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో పంట నష్టపోయినా ఎలాంటి పరిహారం రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో కౌలు రైతులకు కూడా రైతు భరోసా వర్తింపజేస్తామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చింది. ఆరు గ్యారెంటీల్లో ఇది కూడా ఒకటి. వారు కోరుకున్న విధంగానే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పెట్టుబడి సాయంపై ఆశలు పెట్టుకున్నారు. ఉమ్మడి జిల్లాలో 1,17,268మంది కౌలు రైతులు ఉండగా ఆదిలాబాద్ జిల్లాలో 28,763మంది, నిర్మల్‌లో 33,212మంది, మంచిర్యాలలో 28,584మంది, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 26,754మంది ఉన్నారు. కానీ ప్రస్తుతం వీరికి సంబంధించి ప్రభుత్వం కసరత్తు చేయడం లేదు. వివరాల సేకరించడంలోనూ ఎలాంటి ఆదేశాలు జారీ చేయకపోవడంతో తమకు పెట్టుబడి సాయం వస్తుందా లేదా అనేది కౌలు రైతుల్లో సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఏడాదిలో రైతులకు వచ్చే రైతుభరోసా నిధుల వివరాలు

జిల్లా	రైతులు	నిధులు అవసరం(కోట్లలో)
ఆదిలాబాద్	1.47లక్షలు	రూ.537.79
మంచిర్యాల	1.59లక్షలు	రూ.337.76
నిర్మల్	1.75లక్షలు	రూ.439.47
ఆసిఫాబాద్	1.19కోట్లు	రూ.422.88

సాయం త్వరగా అందించాలి : దామెర్ల గోపాల్‌రెడ్డి, రైతు, ధన్నూర్(బి)



ప్రభుత్వం రైతుభరోసా కింద అందజేసే పెట్టుబడి సాయాన్ని త్వరగా అందించాలి. ఇప్పటికే విత్తనాల కొనుగోలుకు ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఎరువులు, పురుగు మందుల కొనుగోలుకు డబ్బులు అవసరమవుతాయి కనుక త్వరగా అందిస్తే అన్నదాతలకు ప్రయోజనం కలుగుతుంది.



కౌలు రైతులకు కూడా అందించాలి : ఇదాపు రామకృష్ణ, కన్నుట్ల

గ్రామంలో సొంతంగా మూడు ఎకరాల భూమితో పాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తుంటాను. ఒక్కో ఎకరానికి రూ.15వేలు కౌలు డబ్బులతో పాటు మరో రూ.లక్ష వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం హామీనిచ్చినట్లుగా కౌలు రైతులకు కూడా పెట్టుబడి సాయం అందించి ఆర్థిక భరోసా ఇవ్వాలి.

పెంచిన పింఛన్ ఇవ్వాలని కలెక్టరేట్ ఎదుట ఆందోళన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెంచిన పింఛన్లు ఇవ్వాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌రాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన కొనసాగించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రేమ్‌రాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అభయహస్తం కింద దివ్యాంగులకు ఆరు వేల రూపాయల పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. వృద్ధులు, వితంతవులకు పెన్షన్ పెంచుతామని చెప్పిందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలవుతున్నా ఇప్పటి వరకు పెంచిన పెన్షన్ ఇవ్వడం లేదన్నారు. అదే విధంగా దివ్యాంగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఇప్పటికే అధికారులకు పలుమార్లు విన్నపాలు ఇచ్చామన్నారు. పెంచిన పెన్షన్‌తో పాటు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమలో ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్, వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు నాందేవ్, కనక కిషన్, సంతోష్, బాలాజీ, సతీష్, అనసూయ, గీతాబాయి, సత్యభామ, స్వాతి, రాధ పాల్గొన్నారు.

ఈవీఎంల భద్రతకు పటిష్ట చర్యలు



నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్‌లోని ఈవిఎం గోదాము వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం ఈవిఎం గోదాము వద్ద బందోబస్తు ఏర్పాట్లను తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాలకు సంబంధించి ఈవిఎం గోదాములో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్లను పటిష్టమైన నిఘా ఏర్పాట్ల మధ్య భద్రపరచడం జరిగిందని, సిసి కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు.

జెడ్పీ ప్రత్యేకాధికారిగా రాజర్షి షా బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జడ్పీటీసీలు, జడ్పీ చైర్మెన్ పదవీ కాలం గురువారంతో పూర్తయింది. శుక్రవారం జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ రాజర్షి షా బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయానికి వచ్చిన కలెక్టర్‌కు జడ్పీ సీఈఓ రత్నమాల పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. అనంతరం జడ్పీ చైర్మెన్ ఛాంబర్‌లో ప్రత్యేక అధికారిగా జడ్పీ సీఈఓ ద్వారా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాజీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్‌తో పాటు అధికారులు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ డిప్యూటి సీఈఓ కలిందిని, సూపరింటెండెంట్లు సుధాకర్, నర్సింగ్‌రావు, వెంటకేష్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైన భోజనం అందించాలి



నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకట రమేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సెంటర్‌లో స్టాక్ వివరాలను, రికార్డులను, కేంద్రానికి వచ్చే చిన్నారుల, బాలింతల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల హాజరు శాతం పెంచాలని, వారికి నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినయ్‌సాయి పాల్గొన్నారు.

గులాబీలో గుబులు..!

- బీఆర్‌ఎస్‌ను వీడుతున్న కీలక నాయకులు
- తాజాగా హస్తం గూటికి ఎమ్మెల్సీ దండె విఠల్
- అధికార పార్టీ వైపు వరుస కడుతున్న నాయకులు
- తాజా పరిణామాలతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో కలవరం

రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తర్వాత గులాబీ పార్టీ గడ్డు పరిస్థితి ఎదుర్కొంటోంది. ఇన్నాండ్లు ఆ పార్టీలో కీలక నేతలుగా చలామణి అయిన వారు ఒక్కొక్కరుగా ఆ పార్టీని వీడి బయటకు వస్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ వైపు వరుస కడుతుండటం ఆ పార్టీ శ్రేణుల్లో కలవరం రేపుతోంది. లోక్‌సభ ఎన్నికల సమయంలో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు సీనియర్ నాయకులు హస్తం గూటికి చేరగా.. తాజాగా ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ దండె విఠల్ సైతం కాంగ్రెస్ కండువా కప్పుకోవడం చర్చనీయాంశమైంది. రాష్ట్రంలో ఆరుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరగా.. వారిలో ఉమ్మడి జిల్లాకు చెందిన దండె విఠల్ ఒకరు కావడం గమనార్హం.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరపున బరిలో నిలిచిన దండె విఠల్ సునాయాసంగా విజయం సాధించారు. హైదరాబాదులో స్థిరపడినప్పటికీ ఉమ్మడి జిల్లాలోని కాగజ్‌నగర్‌కు చెందిన వ్యక్తి కావడంతో ఆ పార్టీ అధిష్టానం ఆయనకు ఎమ్మెల్సీ టికెట్ కేటాయించినట్లు తెలిసింది. ఆ సమయంలో ఆ పార్టీలో ఎమ్మెల్సీ టికెట్ ఆశించిన పలువురు నేతలు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన స్థానికులకు కాకుండా ఇతర ప్రాంతంలో స్థిరపడిన వారికి టికెట్ కేటాయించడమేంటని పలువురు నేతలు ఆ పార్టీ అధిష్టానం తీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఓ జడ్పీటీసీ ఎన్నికల్లో రెబెల్‌గా బరిలో నిలిచారు. అయినప్పటికీ ఆ పార్టీ అధిష్టానం సూచనల మేరకు అప్పటి ప్రజాప్రతినిధులు విఠల్‌ను ఎమ్మెల్సీగా గెలిపించారు. ఉమ్మడి జిల్లాలో కొన్నేండ్ల నుంచి ఆ పార్టీలో కీలక నాయకుడిగా వ్యవహరించిన ఆయన అనూహ్యంగా కాంగ్రెస్‌లో చేరడంతో గులాబీ శ్రేణుల్లో గుబులు రేపుతోంది.

పార్టీని వీడిన కీలక నాయకులు

ఉద్యమ కాలంతో పాటు పదేండ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ఉమ్మడి జిల్లాలో తిరుగులేని శక్తిగా అవతరించింది. అధికారంలో ఉన్న సమయంలో ఎంపీ, ఓ ఎమ్మెల్సీ మినహాయించి పది మంది ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మెన్లు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులతో ఆ పార్టీ కళకళలాడింది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం పొంది అధికారం కోల్పోవడంతో ఒక్కసారిగా పార్టీ పరిస్థితి తలకిందులుగా మారింది. పది అసెంబ్లీ స్థానాల్లో కేవలం రెండింటిలో మాత్రమే విజయం సాధించింది. మరోపక్క అధికారం కోల్పోగానే ఆ పార్టీకి చెందిన కీలక నేతలు గులాబీ పార్టీని వీడి బయటకు వస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ఆ పార్టీ తరపున మంత్రిగా సేవలందించిన మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, కోనేరు కోనప్ప, కీలక నాయకులైన వేణుగోపాలచారి వంటి వారితో పాటు అనేక మంది తాజా మాజీ జడ్పీటీసీలు, ఎంపీపీలతో పాటు కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు బీఆర్‌ఎస్‌ను వీడుతుండటం ఆ పార్టీని మరింత కలవర పెడుతోంది. వరుసగా కీలక నాయకులు పార్టీని వీడుతుండటం బీఆర్‌ఎస్ శ్రేణుల్లో గుబులు రేకెత్తిస్తోంది. పార్టీ అధిష్టానం దృష్టిపెట్టకపోతే మరిన్ని వలసలు పెరుగుతాయని ఆ పార్టీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

రోడ్డు సౌకర్యం కల్పించాలని రాస్తారోకో



నవతెలంగాణ-నార్నూర్

ఆదివాసీ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని శుక్రవారం గాదిగూడ మండల కేంద్రంలో ఆదివాసీ విద్యార్థి సంఘం, సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. అనంతరం తహసీల్దార్ విజయానందంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర దేశంలో నేటికీ 12 గ్రామాలకు రోడ్డు సౌకార్యం లేకపోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిగ్గు పడాలన్నారు. ఆదివాసీ గ్రామాలకు నీరు, రోడ్డు సౌకర్యం కల్పించేంత వరకూ ఆందోళనలు చేస్తామన్నారు. గాదిగూడ, ఝరి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులను, పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలన్నారు. సమస్యలపై సంబంధిత శాఖల అధికారులు వచ్చి స్పందించాలన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే ఐటిడిఎను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ సంతోష్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండలం అధ్యక్షులు కోరేంగ శంభు, నాయకులు కొడప లింగు, మెస్రం సంతోష్, మెస్రం గోవింద్, ఉయిక లింగు, ఆత్రం విజయ్, నైతం సోనేరావ్, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ విద్యుత్ మీటర్ బిగించుకోవాలి

నవతెలంగాణ-బోథ్

ప్రతి ఒక్క ఇంటికీ కరెంటు మీటరు ఏర్పాటు చేసుకోవాలని విజిలెన్స్ ఏడీ విజయ సారథి అన్నారు. శుక్రవారం మండలంలోని సాకెర గ్రామాన్ని విజిలెన్స్ అధికారులు సందర్శించారు. గ్రామస్తులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేస్తుండడంతో స్తంభాలకు డైరెక్ట్‌గా కొండీలు వేసుకొని విద్యుత్ ఉపయోగించకూడదని సూచించారు. కరెంటు మీటర్ లేని వారికి మీటర్ ఇప్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఏఈలు యోగేష్, రవీందర్, బోథ్ ఏఈ రామకృష్ణ, సబ్ ఇంజనీర్ వెంకటేష్, లైన్ ఇన్‌స్పెక్టర్ పవార్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

బొగ్గు గనులు సింగరేణికే అప్పగించాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బొగ్గు గనుల వేలం పాటను నిలిపేసి, శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను సింగరేణికే అప్పగించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం బొగ్గు గనుల వేలం పాట ఆపివేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనుల వేలాన్ని ఆపేసి సింగరేణికి నేరుగా కేటాయించాలన్నారు. మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును వేలం వేయడానికి యత్నిస్తోందని, సింగరేణి కంపెనీ కూడా ప్రయివేటు సంస్థలతో పాటు వేలంపాటలో పోటీ పడాలని నిర్ణయించడం సరికాదని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో నాలుగు బ్లాకులను బీఆర్‌ఎస్ పాలనలోనే మోడీ ప్రభుత్వం ప్రయివేటు సంస్థలకు అప్పగించిందన్నారు. తెలంగాణకు మణిహారంగా ఉన్న సింగరేణిని కాపాడుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు కదలాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు గొడిసెల కార్తీక్, జాదవ్ రాజేందర్, నాయకులు గేడం టికానంద్, కోరెంగ మాలశ్రీ, జాడి తిరుపతి, నిఖిల్, కృష్ణమాచారి పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

నూతన బొగ్గు గనులను వేలం వేయకుండా నేరుగా సింగరేణి కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనులను ప్రభుత్వరంగ సంస్థలకు ఇవ్వకుండా వేలం ద్వారా ప్రయివేట్ కంపెనీలకు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. తెలంగాణలో ఉన్న నూతన బొగ్గు గనులను వేలం వేయకుండా సింగరేణికి ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విన్నవించినా కేంద్ర ప్రభుత్వం మొండివైఖరి వల్ల బొగ్గు గనులను వేలం వేస్తున్నారని విమర్శించారు. దీని వల్ల సింగరేణికి భవిష్యత్తులో మనుగడ ఉండదని తెలిపారు. ప్రజలకూ తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. బొగ్గు గనులను వేలం వేయకుండా ఎంఎండిఆర్ చట్టం కింద నామినేషన్ పద్ధతిలో ఇతర రాష్ట్రాలకు ఇచ్చిన విధంగా సింగరేణికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి సోమారం తిరుపతి, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి రాయిల్లా నర్సయ్య, నాయకులు రమేష్, సురేష్, మోర్ల శ్యామ్‌రావు, తోట రాంచందర్, శ్యామల పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శనివారం | జులై 06, 2024 | www.navatelangana.com

వానాకాలం పంటల నమోదు పరిశీలన

నవతెలంగాణ-నేరడిగొండ

వానాకాలం పంటల నమోదును శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య పరిశీలించారు. మండలంలోని బొందిడి గ్రామంలో ఏఈఓ మహేందర్, చేస్తున్న పంటల నమోదు ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏఈఓలు ప్రతి వ్యవసాయ క్షేత్రం సందర్శించి, వానాకాలం పంటల నమోదు చేయాలన్నారు. సాగు చేస్తున్న ప్రతి పంటను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అన్నారు. రైతు



తప్పకుండా తమ పంటలను వ్యవసాయ విస్తీర్ణ అధికారుల ద్వారా పంటల నమోదు చేసుకోవాలని అన్నారు. పంటల నమోదు ద్వారా పంట మార్కెటింగ్‌లో రైతులకు ఇబ్బందులు ఉండవని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భాస్కర్, రైతులు శ్యామ్‌రావు, పరశురామ్ జనార్ధన్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖీ కేంద్రం పారామెడికల్ హెల్త్ వర్కర్ సుకేష్ణ అన్నారు. శుక్రవారం సఖీ కేంద్రం ఆధ్వర్యంలో మావల, బట్టి సవర్గాం గ్రామపంచాయతీ పరిధిలోని దుబ్బగూడలో మహిళలకు, బట్టి సవర్గాం అంగన్‌వాడీ సెంటర్-2లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సఖీ కేంద్రం అందించే ఐదు రకాల సేవలు, కౌన్సెలింగ్ సేవలు, న్యాయ సహాయం, పోలీస్ సహాయం, వైద్య సేవలు, తాత్కాలిక వసతి గురించి, ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మహిళల, బాలికల చట్టాలు గృహ హింస చట్టం, బాల్యవివాహాల చట్టం, పోక్సో చట్టం, సైబర్ క్రైమ్, తదితర చట్టాల గురించి, సఖి కేంద్రంలో వచ్చిన బాధితుల వివరాలను గోప్యంగా ఉంచబడతాయని అత్యవసర సమయాలల్లో హెల్ప్ లైన్ నెంబర్లు 181, 100, 1098, 1930 సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నందు, ప్రియాంక, అంగన్‌వాడీ టీచర్ సువర్ణ, మహిళలు పాల్గొన్నారు.

బొగ్గు గనుల వేలాన్ని అడ్డుకుంటాం

- వామపక్షాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అదానీ ఆస్తులు పెంచడానికి, సింగరేణిని ఆయనకు కట్టబెట్టడానికి బొగ్గు గనులను వేలం వేస్తుందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. సింగరేణి బొగ్గు గనుల వేలాన్ని అడ్డుకుంటామని తేల్చి చెప్పారు. శుక్రవారం సింగరేణి బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ, కేంద్రం ప్రభుత్వ తీరుకు నిరసనగా వామపక్షాలు సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ముందుగా సీపీఐ(ఎం) కార్యాలయం నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు వచ్చారు. అనంతరం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ సింగరేణికే బొగ్గు గనులను అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగసంస్థ అయిన సింగరేణి వల్ల ప్రభుత్వానికి లాభాలు వస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రయివేటు సంస్థలకు కట్టబెడుతున్నదని అందులో భాగంగానే రూ.28,747 కోట్ల విలువైన గనులను ప్రయివేటు సంస్థలకు ఇవ్వాలని నిర్ణయించారన్నారు. గత పదేండ్లలో మోడీ ప్రభుత్వం సుమారు 200 బొగ్గు బావులను ప్రయివేటు సంస్థలకు కట్టబెట్టారని దీని ఫలితమే ఇప్పుడు జరుగుతున్న వేలం దేశవ్యాపితంగా 10వ విడతలో 61 బొగ్గుబావులను వేలం వేస్తున్నారన్నారు. రాష్ట్రంలో బీజేపీ నుంచి 8 మంది శాసనసభ్యులు, మరో 8మంది పార్లమెంట్ సభ్యులు ఉండి కూడా తెలంగాణకు ఇంత అన్యాయం జరుగుతుంటే నోరు మెదపటం లేదన్నారు. ప్రస్తుతం సింగరేణి 40వేల మంది పర్మినెంట్ కార్మికులకు, మరో 26వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు ఉపాధి కల్పించిందని, రికార్డు స్థాయిలో తక్కువ ధరకే నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేస్తున్నదన్నారు. గత పదేండ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డివిడెండ్ రూపంలో రూ.49,666 కోట్లు చెల్లించిందని ఇందులో కేంద్రానికి రూ.26వేల కోట్లు చెల్లించగా, రాష్ట్రానికి రూ.23వేల కోట్లు చెల్లించిందన్నారు. ఒకవైపు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, మరోవైపు ప్రభుత్వాలకు ఆదాయపు వనరుగా ఉన్నదన్నారు. వేలాదిమంది కార్మిక కుటుంబాలకు ఉపాధి లభిస్తున్నదని అలాంటి సంస్థను ప్రయివేటీకరించాలన్న ఆలోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జగన్ సింగ్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకట్ నారాయణ, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు తొడసం భీంరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.మంజుల, బొజ్జ ఆశన్న, ఐద్వా నాయకులు లంక జమున, కోవే శకుంతల, పోచక్క, భీంపూర్ మండల కన్వీనర్ ధోనిపెల్లి స్వామి, సీఐటీయూ నాయకులు అగ్గిమల్ల స్వామి, లింగాల చిన్నన్న, ఇంద్రజి, సీపీఐ జిల్లా నాయకులు అరుణ్ కుమార్, కుంటల రాములు, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు సురేష్, రేణుక న్యూడెమోక్రసీ నాయకులు వామన్, గణేష్, గంగమ్మ దత్తు, శ్యామ్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు మునిగెల నర్సింగ్ పాల్గొన్నారు.

నిర్మల్ : బొగ్గు గనుల వేలాన్ని ఆపాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు.అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ ఎన్డీఏ ప్రభుత్వం వేలం పాటలు నిర్వహించి, సింగరేణిని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఆరు జిల్లాల్లో విస్తరించి ఉన్న సింగరేణి ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాదిమందికి ఉపాధిని కల్పిస్తున్న సింగరేణి కార్మిక ప్రజల ప్రయోజనాలను బలిపెట్టడానికి దుర్మార్గమైన నిర్ణయమన్నారు. రాష్ట్రానికి చెందిన కిషన్‌రెడ్డికి గనుల శాఖను అప్పజెప్పి అధికారంలోకి రాగానే మొదటి నిర్ణయంగా ఇలాంటి కార్మికులు బలిపెట్టే నిర్ణయాలు తీసుకోవడం వెంటనే మానుకోవాలని అన్నారు. మానిటైజేషన్ పేరుతో ప్రయివేటీకరణ దిశగా 2025 వరకు రూ.28,745 కోట్లు సంపాదించుకునే దిశగా కేంద్ర ప్రభుత్వం ఈ దుర్మార్గమైన నిర్ణయం తీసుకుందని అన్నారు. రాష్ట్రంలో అధికారం ఉన్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిర్ణయం వెనక్కి తీసుకునేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. కార్మికుల ప్రయోజనాలకు నష్టం తెచ్చే ఇలాంటి నిర్ణయాలు బీజేపీ ఎన్డీఏ ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోతే వేలంపాటలు రద్దు చేయకపోతే, ఐక్య పోరాటాన్ని కొనసాగించి కేంద్ర ప్రభుత్వం మెడలు పంచుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సీనియర్ నాయకులు ఎస్ఎన్ రెడ్డి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నందిరామయ్య, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జే రాజు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి హరిత, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్, భూక్య రమేష్, కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, పీఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దిగంబర్, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తోడసం శంభు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు బర్కుంటా గంగారాం పాల్గొన్నారు.


నిర్మల్

చౌకధరల దుకాణం ఏర్పాటుతో గ్రామస్తుల్లో హర్షం



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని ఆరెపల్లి గ్రామంలో శుక్రవారం చౌకధరల దుకాణం ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ నాయకులు కమల్‌సింగ్, గ్రామస్తులకు చౌక ధరల దుకాణం లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, ఆరెపల్లి నుంచి లింగట్లకు చౌక ధరల దుకాణానికి వెళ్లే క్రమంలో రోడ్డు క్రాస్ చేస్తున్న క్రమంలో ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా, ఉండే విధంగా గ్రామంలో చౌక ధరల దుకాణం ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌కు విన్నవించారు. దీంతో తహసీల్దార్ ఆర్డీఓని కలిసి రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేశారు. కాగా దీనిని శుక్రవారం సేల్స్‌మెన్ ఎస్.సంభు, గ్రామస్తులతో కలిసి పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సేల్స్‌మెన్ ఎస్.సంభు మాట్లాడుతూ అందుబాటులో ఉన్న రేషన్ దుకాణాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యుద్ఘాతంతో వ్యక్తి మృతి



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని నాగల్‌కొండ గ్రామానికి చెందిన జాదవ్ హేమంత్ (45) శుక్రవారం విద్యుద్ఘాతంతో మృతి చెందాడు. స్థానికులు బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగానే హేమంత్ ఇంటి ముందర గ్రామానికి చెందిన ఆడే కాలురాం పొలం వైపు ఉదయం కాలకృత్యాలకు వెళ్లాడు. కాలురాం పొలంలో అమర్చిన ఫెన్సింగ్ వైరుపై నుంచి బోరు కరెంటు సర్వీస్ వైరు వేశాడు. అది అనుకోకుండా కట్ అయి, ఫెన్సింగ్ వైర్‌లో ఎర్త్ రావడంతో కాలకృత్యాలకు వెళ్తున్న ఆయన వైరు పట్టడంతో అక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బాలికల ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని విజయ్‌నగర్ కాలనీలోని ఆశ్రమ బాలికల పాఠశాలలో శుక్రవారం పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబు వైద్య సిబ్బందితో కలిసి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 55 మంది విద్యార్థినులకు సీబీపీ రక్త నమూనా పరీక్షలు చేశారు. జ్వరం జలుబు ఉన్న వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్య శిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, ప్రధానోపాధ్యాయుడు జాదవ్ విఠల్, ఉపాధ్యాయ వైద్య సిబ్బంది రాథోడ్ జ్యోతి, సుభాష్, గంగా, ఈశ్వర్, జంగుబాయి, ఉజ్వల, సరిత, శ్రీకాంత్ ఉన్నారు.

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నవతెలంగాణ-ఖానాపూర్

ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మెన్ రాజురా సత్యం అన్నారు. శుక్రవారం ఖానాపూర్ పట్టణంలోని రాజీవ్ నగర్ 11వ, ఐదవ వార్డు ఇంద్రనగర్ కాలనీలలో డ్రైడేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రతి ఒక్కరూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కూలర్లు, పాత టైర్లు పనికిరాని వస్తువులలో నిల్వ ఉన్నటువంటి వర్షపు నీటిని తొలగించాలని కోరారు. లేకపోతే వాటిపై అనేకమైన బ్యాక్టీరియా వైరస్ ఏర్పడి దోమలు ఏర్పడతాయని వాటి వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతారని అన్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని అన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ కావలి సంతోష్, 5వ వార్డు కౌన్సిలర్ పరిమి లత సురేష్, నాయకులు చరణ్, మున్సిపాలిటీ అధికారులు వార్డు ఆఫీసర్లు రమేష్, రాజేంద్రప్రసాద్, ఆశా వర్కర్లు అంగన్‌వాడీ, మెప్మా, సిబ్బంది పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ ఫోటో, వీడియో గ్రాఫర్ల నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షులుగా గుగ్గిళ్ళ ఎల్లయ్య, ఉపాధ్యక్షులుగా రెడ్డి నర్సయ్య ప్రధాన కార్యదర్శిగా వరుణ్, కోశాధికారిగా రాజేష్, ప్రచార కార్యదర్శిగా సతీష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్లేష్, కోర్ కమిటీ అధ్యక్షులుగా లవకుమార్, సభ్యులుగా సాయికుమార్, నవీన్, రాజ్ కుమార్, నాగరాజు, సంజయ్, భూమేష్, రాజశేఖర్, రాకేష్ నియమితులయ్యారు. ఈ ఎన్నికలు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పడిగెల కాశీనాథ్, నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతామణి కృష్ణ స్వామి, గౌరీకర్ రాజు నిర్వహించారు.

గుంతలు పూడ్చి దోమలను అరికట్టాలి



నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలో ఎన్‌హెచ్ నెం.44 రహదారికిరువైపులా ఉన్న సర్వీస్ రోడ్డు పక్కన గుంతలు ఏర్పడి ప్రయాణికుల, గ్రామస్తులకు ఇబ్బంది కరంగా మారింది. మండల కేంద్రం నుంచి వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వాహనాల రాకపోకలతో ఏర్పడిన గుంతల్లో వర్షం నీరు చేరడంతో పాటు ద్విచక్రవాహనదారులు తరుచూ ప్రమాదానికి గురవుతున్నారు. అదేవిధంగా ఆ గుంతల్లో చెత్తాచెదారం వచ్చి చేరుతోంది. ఆ గుంతల్లో వర్షపు నీరు నిలిచి ఉండటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. పారిశుధ్యం లోపించకుండా అధికారులు దోమల వృద్ధిని అరికట్టేందుకు అక్కడ ఆయిల్ బాల్స్ వేసేలా చర్యలు తీసుకోవాలి. ఇప్పటికైనా సంబంధితశాఖాధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై దృష్టి సారించాలి

- ఏజెన్సీ డీఎంహెచ్ఓ మనోహర్

నవతెలంగాణ-నార్నూర్

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై దృష్టి సారించాలని వైద్య సిబ్బందిని ఏజెన్సీ డీఎంహెచ్ఓ కుడ్మేత మనోహర్ సూచించారు. శుక్రవారం గాదిగూడ మండల కేంద్రంతో పాటు ఝరి పీహెచ్‌సీని సందర్శించారు. ఆయా ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన వైద్య శిబిరాలను పరిశీలించారు. వివిధ రకాల రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల ముందు జాగ్రత్త తీసుకోవాలన్నారు. పరిసరాల్లో చెత్త చెదారం లేకుండా చూసి డ్రైడే నిర్వహించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు వేడి వేడి ఆహారం తీసుకోవాలని అవగాహన కల్పించారు. వారి వెంట డాక్టర్ సంజీవ్, హెచ్ఈఓ తులసిదాస్, రవీందర్, పవార్ రవీందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్, సిబ్బంది కృష్ణ, జలపథ్, సుంగు, ఆచంత్ ఉన్నారు.

మొరం అక్రమ తవ్వకాలు జరిపిన వ్యక్తికి రూ.50వేల జరిమానా

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని కుప్టి గ్రామంలో శుక్రవారం మొరం అక్రమంగా తవ్వకాలు నిర్వహిస్తుండగా మైనింగ్‌శాఖాధికారులు దాడులు నిర్వహించి రూ.50వేల జరిమాన విధించినట్టు మైనింగ్‌శాఖాధికారులు రాయల్టీ ఇన్స్‌పెక్టర్ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఎవరైనా తవ్వకాలు జరుపుతే జరిమానతో పాటు తగు చర్యలు తీసుకుంటామన్నారు.

అక్రమ అరెస్టులకు ఖండన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి, యువజన సంఘాల నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గణేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం కుమురంభీమ్ భవన్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని అన్నారు. హైదరాబాద్‌లో టీజీపీఎస్సీ వద్ద ఆందోళనకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి, యువజన సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టులు చేసి నిర్బంధించారన్నారు. వీరందరిని తక్షణమే విడుదల చేసే విధంగా సీఎం రేవంత్ రెడ్డి పోలీసులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి కనక దత్తాత్రి, జిల్లా నాయకులు బగ్గి శ్రీకర్, పీవైఎల్ జిల్లా నాయకులు మెస్రం మారుతి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్
- డ్రైడేలో భాగంగా కాలనీలో పర్యటన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దోమల వల్ల అనేక వ్యాధులు ప్రబలుతాయని, వాటి నివారణకు ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. శుక్రవారం డ్రైడేలో భాగంగా పట్టణంలోని కోలిపురలో పర్యటించారు. నీరు నిల్వ ఉండకుండా చూడాలని కాలనీ వాసులకు సూచించారు. అక్కడక్కడ కూలర్లు, టైర్లు, కొబ్బరి బొండ, కుండిల్లో నీరు నిల్వ ఉండటంతో వాటిని తొలగించారు. మున్సిపల్ తరపున మురుగు కాలువలను శుభ్రం చేయించి, బ్లీచింగ్‌తో పాటు స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ దోమల వల్ల డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా లాంటి వ్యాధులు వస్తాయన్నారు. వర్షకాలంలో నీరు నిల్వ ఉన్న కారణంగా దోమలు వృద్ధి చెందుతాయన్నారు. గత సంవత్సరం జిల్లాలో 108 డెంగ్యూ కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ సంవత్సరం కేసులు లేకుండా ముందస్తుగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ రోగాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎలాంటి అనారోగ్యం అనిపించిన సమీపంలో పీహెచ్‌సీలో వైద్యులను చూపించి, చికిత్సలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, జిల్లా మలేరియా అధికారి శ్రీధర్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ నరేందర్, వైద్యారోగ్య, మున్సిపల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతో రోగాలు దూరం

నవతెలంగాణ-తాంసి

వర్షాకాలంలో ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు రావడానికి అవకాశం ఉండదని వైద్యాధికారి డాక్టర్ నిఖిల్ రాజ్ ప్రజలకు సూచించారు. వర్షాకాలం దృష్ట్యా ముందస్తు ప్రణాళికలలో భాగంగా శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భీంపూర్ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఫ్రైడే-డ్రైడే జాతీయ కీటక జనిత ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మందపల్లి గ్రామంలో ఆరోగ్య సిబ్బందితో కలిసి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. క్లోరినేషన్ చేసిన నీటిని, గాని కాచి చల్లార్చిన నీటిని తాగడానికి వినియోగం చేయాలని, వేడి, వేడి ఆహారపదార్థాలను భుజించాలని అన్నారు. వ్యక్తి గత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని అన్నారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, నిల్వ నీటిపై మూతలను ఉంచాలని, జ్వరం, నీళ్ళ విరేచనాలు వచ్చిన వెంటనే



ఆశా కార్యకర్తలను, ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించి, పరీక్షలు చేయించుకోని వైద్యాధికారి సూచనలతో మందులను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తీర్ణాధికారి లింగంపల్లి జ్ఞానేశ్వర్ పర్యవేక్షకులు బి.గంగాధర్, ఎంఎల్‌హెచ్‌పీ జె.మాయావతి, పంచాయతి కార్యదర్శి రవికాంత్, ఆరోగ్య కార్యకర్త నఫీజ, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మి, సాజిద, అనసూయ, కవిత, సంబంధిత అన్ని గ్రామాల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాథోడ్ రమేష్ మృతి జిల్లా ప్రజలకు తీరని లోటు

నవతెలంగాణ-కడెం

రాథోడ్ రమేష్ మృతి జిల్లా ప్రజలకు తీరని లోటు రాపర్తి శ్రీనివాస్ అన్నారు. ఆయన అకాల మరణం జిల్లా ప్రజలను ఎంతో దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. శుక్రవారం ఉదయం కడెం మండలంలోని ఎలగడప గ్రామంలో పార్టీలకతీతంగా వారి అభిమానులు కలిసి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఐదు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా రాపర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ రాథోడ్ భౌతికంగా దూరమైన మా అందరి గుండెల్లో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్, భూమరాజం, రవి, శ్రీనివాస్, గంగన్న, రాజేందర్, ప్రసాద్, భూపతి ఉన్నారు.

పుడమి తల్లిని రక్షించుకోవడం మనందరి బాధ్యత

నవతెలంగాణ-నార్నూర్



పుడమి తల్లిని రక్షించుకోవడం మనందరి బాధ్యతని మండల బీజేపీ యువ నాయకులు బిక్కు రాథోడ్ అన్నారు. శుక్రవారం డాక్టర్ శ్యామ్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకొని ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో నానాటికి చెత్త పెరిగిపోతునే ఉందనీ, చెత్త కారణంగా పర్యావరణం కలుషిత మయ్యే అవకాశాలు ఎక్కువ ఉన్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. తద్వారా పర్యావరణం కాపాడటంతో పాటు మానవాళికి కావాల్సిన ఉత్పత్తులు కూడా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బాబూలాల్, సంతోష్, సావన్, రాహుల్, ధర్మరక్షక్, అరవింద్ ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శనివారం | జూన్ 06, 2024 | www.navatelangana.com

విద్యార్థుల కు నోటుబుక్స్ పంపిణీ

నవతెలంగాణ-పెంచికల్ పేట్



మండలంలోని దరువపెల్లి ప్రాథమిక పాఠశాలలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమాని బొట్టుపల్లి హరీష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు బుక్కులను, పెనులను అందజేశారు. కార్యక్రమంలో బూరుగు మల్లేష్, కర్నె మాదయ్య, కర్నె మహేష్, బూరుగు శ్రీను, ఏర్రబోయిన సాయి పాల్గొన్నారు.

బదిలీ అయిన వారిని రిలీవ్ చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



బదిలీ అయిన ఎస్జీటీ ఉపాధ్యాయులందరిని రిలీవ్ చేసి, అవసరమైన పాఠశాలలకు పని సర్దుబాటు చేయాలని పిఆర్టియు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌తో కలిసి జిల్లా విద్యాధికారి అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతీకరించిన పండిట్ పిఈటి పోస్టులను ట్రెజరీలో అప్‌డేట్ చేయాలని, క్యాడర్ స్ట్రెంత్ మార్చాలని కోరారు. ఎనిమిది సంవత్సరాలు ఒకే గ్రామపంచాయతీలో పనిచేసిన ఉపాధ్యాయులకు తిరిగి అదే గ్రామపంచాయతీలో కేటాయించారని, వారిని వేరే ప్రాంతాలకు మార్చి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 42 మందికి 10 స్పౌస్ పాయింట్లు పెట్టకుండానే పాయింట్లు వాడినట్లు చూపించారన్నారు. వీటన్నింటినీ సవరించాలని డిమాండ్ చేశారు.

చినుకుపడితే చిత్తడే..!



నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే వారసంతలో చినుకుపడిందంటే చిత్తడి మయంమవుతోంది. ప్రతి వర్షాకాలం ఇబ్బందులు పడుతున్నామని అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రతి సంవత్సరం వేలం పాట ద్వారా రూ.లక్షలు వస్తున్నా, వచ్చిన డబ్బులు ఏమవుతున్నారని స్తానికులు ప్రశ్నిస్తున్నారు. కనీసం వారసంతలో సౌకర్యాలు కల్పించకపోవడంతో వివిధ గ్రామాల నుండి వచ్చే చిన్నపాటి వ్యాపారస్తులు బురదలో కూర్చొని వ్యాపారం చేయాల్సి వస్తుంది. వారసంతలో షెడ్లు సైతం లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి వారసంతలో సౌకర్యాలు కల్పించాలని గ్రామస్తులు, చిరువ్యాపారులు కోరుతున్నారు.

దేశీదారు పట్టివేత

నవతెలంగాణ-వాంకిడి

మహారాష్ట్ర నుంచి ఆసిఫాబాద్ పట్టణానికి అక్రమంగా తరలిస్తున్న దేశీదారును పోలీసులు పట్టుకొని నిందితుడిపై కేసు నమోదుచేశారు. శుక్రవారం ఎస్ఐ సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్‌కు చెందిన బండారి రాజశేఖర్ సాయంత్రం వాంకిడి బస్టాండులో బ్యాగు పట్టుకొని అనుమానస్పదంగా కనిపించడంతో అతని వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేశారు. అందులో వంద దేశీదారు మద్యం 90 ఎంఎల్ బ్యాటిళ్ల పట్టుకున్నారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.నాలుగు వేలు ఉంటుంది. సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ తనిఖీలో ఏఎస్ఐ పోశెట్టి, కానిస్టేబుళ్ల ధన్‌రాజ్, దుర్గాప్రసాద్ ఉన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయుల కృషి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

తమ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఆ పాఠశాలకు నూతనంగా బదిలీపై వచ్చిన ఉపాధ్యాయుల కృషిని గ్రామస్థులు అభినందిస్తున్నారు. కాగజ్‌నగర్ మండలం దుర్గయ్యవాడ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు అబ్దుల్ ఖమర్, జర్పుల విజయ్‌లు దుర్గయ్యవాడతో పాటు లక్ష్మినగర్ కాలనీలో ప్రతీ ఇంటికి వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు. వారి పిల్లలను దుర్గయ్యవాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని కోరారు. దీనికి స్పందించిన తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలనే ఆసక్తి ఉన్నా ఇప్పటి వరకు కేవలం ఒకరే ఉపాధ్యాయుడు ఉన్న కారణంగా చేర్పించలేకపోయామని వాపోయారు. ఇద్దరు ఉపాధ్యాయులు ఉంటే ఖచ్చితంగా పిల్లలను ప్రభుత్వ పాఠశాలకే పంపిస్తామని తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు వివరించారు. తమ పిల్లల చదువు కోసం ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని ఈ సందర్భంగా తల్లిదండ్రులు అభినందించారు. ఈ సందర్భంగా తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ ఖమర్ మాట్లాడుతూ పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులను నిలకడగా ఉంచకుండా డిప్యుటేషన్ పేరుతో ఇతర పాఠశాలలకు పంపించడం వల్ల ఇక్కడి విద్యార్థులకు నష్టం జరుగుతోందని అన్నారు. ఈ కారణంగా తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలపై నమ్మకం లేకుండా పోతోందని అన్నారు. ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశమున్నందున పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులను ఇక్కడే ఉంచాలని ఆయన కోరారు.

ఒర్రెలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



నవతెలంగాణ-కెరమెరి

కేలి(కె) ఒర్రెలో వరద ఉధృతికి జైనూర్ మండలానికి చెందిన జె.ప్రకాష్ ఒర్రె దాటే క్రమంలో గురువారం గల్లంతైన విషయం విదితమే. పోలీసు సిబ్బంది శుక్రవారం ఒర్రెలో గాలింపు చేపట్టగా సుమారు 4కిమీ దూరంలోని ఖైరి గ్రామ సమీపంలో మృతదేహం లభించింది. ఎస్సై గుంపుల విజయ్ కుమార్ సంఘట స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

ఘనంగా ఎమ్మెల్యే హరీష్ బాబు జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-దహెగాం

మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంగడి బజార్ ఏరియాలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. కొత్మీర్ గ్రామంలో బీజేపీ నాయకుడు దుంద్ర శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుబ్బాగూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటారు.

సంపూర్ణత అభియాన్ లక్ష్యాలు సాధించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే
- గిరిజన సంస్కృతితో స్వాగతం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సంపూర్ణత అభియాన్ లక్ష్యాలను సమన్వయంతో కృషిచేసి పూర్తిస్థాయిలో సాధించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లాలోని తిర్యానిలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్‌లతో కలిసి మండల కేంద్రంలో వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన నీతి అయోగ్ సంపూర్ణత అభియాన్‌పై నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నీతి అయోగ్‌లో భాగంగా వెనుకబడిన ప్రాంతాలలో ఆరోగ్యం, విద్య, వైద్యం, వ్యవసాయం, స్వయం సహాయక సంఘాల అభివృద్ధి, మహిళలు, శిశువుల సంక్షేమం సంబంధిత అంశాలపై సంపూర్ణత అభియాన్ ద్వారా ప్రత్యేక దృష్టి సాధించడం జరుగుతుందని దీనిలో భాగంగా తిర్యాని ఎంపికయ్యిదన్నారు. మండల అభివృద్ధి కోసం అధికారులు సమిష్టిగా కృషి చేయాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పని చేస్తూ ఉద్యోగులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, పంచాయితీ కార్యదర్శులు, ఉపాధ్యాయులను సమన్వయం చేస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. గర్భం దాల్చిన మహిళలు తమ సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రులలో వివరాలు నమోదు చేసుకుని ప్రతి నెల సమయానుసారంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని, పౌష్టిక ఆహారం, మందులు సకాలంలో తీసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. సెప్టెంబర్ 30వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో సంపూర్ణత అభియాన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, నిర్దేశిత అంశాలపై అధికారులు సమిష్టిగా పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లాలని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం, జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, జిల్లా గ్రామీణభివృద్ధి శాఖ ఎపీడీ రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని ఎలుకపెల్లి గ్రామ శివారులో ఫారెస్టు ఎక్స్‌టెన్షన్-6లో గల ఫారెస్టు భూములు, ఎలుకపెల్లి గ్రామ శివారులో సర్వే నెంబర్ 61లో గల ప్రభుత్వ భూములను కాపాడి ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బొయిరె బండు ఆధ్వర్యంలో తహసీల్దార్, అటవీ రేంజ్ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 10 సంవత్సరాల నుండి ఫారెస్టు ఎక్స్‌టెన్షన్ నెంబర్ ఆరులో గల ప్రభుత్వ భూముల్లో పోతపెల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, బీజేపీ నాయకుడు మధూకర్, శోభన్ ఫారెస్టు భూమిని ఆక్రమించి పెన్సింగ్ ఏర్పాటుచేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ఎలుకపెల్లి గ్రామ శివారులో సర్వే నెంబర్ 61లో మాజీ ఎంపీటీసీ ఒక ఎకరం ప్రభుత్వ భూమిని ఆక్రమించి అసైండ్ భూమిలో నాలా లేకుండా టీఎస్ఐపాస్‌లో దరఖాస్తు చేయకుండా ప్రయాస్‌బ్రిక్స్ ప్లాంట్ ఏర్పాటుచేశారని, నిబంధనలకు విరుద్ధంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసి ఇటుకబట్టీని నడుపుతున్నారన్నారు. వీరిపై చర్యలు తీసుకొని కబ్జాల నుండి ప్రభుత్వ భూములను కాపాబాలని వారు కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చౌదరి తిరుపతి, సముద్రాల రాజన్న, జాజిమొగ్గ శ్రీనివాస్, ఉపాసి సంజీవ్, చంద్రమౌళి, సుధాకర్, బండన్న, ఖైరాత్, వెంకటి పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారులు ప్రజలతో మమేకమవ్వాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలో స్థానిక ప్రజాప్రతినిధుల పదవీకాలం పూర్తయిన నేపథ్యంలో ప్రత్యేక అధికారులుగా నియమితులైన అధికారులు ప్రజలతో మమేకమై పని చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే సూచించారు. జిల్లా కేంద్రంలో అన్ని మండలాల ప్రత్యేక అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిధుల పదవీకాలం పూర్తయిన నేపథ్యంలో ఆ స్థానంలో నియమించబడ్డ అధికారులు వారివలె పని చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. మండలంలోని ఎంపీడీఓతో పాటు ఇతర అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. వివిధ రకాల సమస్యలతో వస్తున్న ప్రజలకు ఊరట కలిగించేలా వ్యవహరించాలని సూచించారు. మండల స్థాయి అధికారులు ప్రతి విషయాన్ని ప్రత్యేక అధికారులతో చర్చిస్తారని వాటిని కూలంకషంగా వినడంతో పాటు పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. మళ్లీ స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే వరకు అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని తెలిపారు.

గురుకులాల పనివేళలను పున:సమీక్షించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

గురుకులాల పని వేళలపై పున:సమీక్ష జరుపాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా గురుకులాల కో కన్వీనర్ కొమ్మినేని నరేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం కాగజ్‌నగర్ మైనార్టీ గురుకుల పాఠశాలలో సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల విద్యాసంస్థలకు నిర్ణయించిన పని వేళల్లో శాస్త్రీయత లోపించిందని, ఈ పనివేళలు విద్యార్థుల మానసిక ఒత్తిడిని పెంచే విధంగా ఉన్నాయని అన్నారు. గత ప్రభుత్వం అధిక సంఖ్యలో గురుకులాలను ప్రారంభించి, అరకొర సౌకర్యాలున్న అద్దె భవనాల్లో నిర్వహించిందని అన్నారు. వీటికి ప్రస్తుతం నిర్ణయించిన పని వేళలు ఎట్టి పరిస్థితుల్లో సమర్థనీయం కాదని, విద్యార్థులు ఏకబిగిన మూడు గంటల పాటు అసౌకర్యమైన తరగతి గదుల్లో కూర్చోవడం సాధ్యం కాని పని అని అన్నారు. ఊరికి దూరంగా ఉన్న విద్యాసంస్థలలో స్టాఫ్‌కు క్వార్టర్‌లు కూడా లేవని, ఉదయం పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు రాత్రి తొమ్మిది గంటల వరకు అక్కడే ఉంటూ నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. పిల్లల మానసిక నిపుణులు, బాలల హక్కుల కమిషన్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల అభిప్రాయాలను పరిగణనలోనికి తీసుకొని విద్యాహక్కు చట్టానికి విరుద్ధంగా ఉన్న పని వేళలను సవరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుచరిత, సిబ్బంది రజి అహ్మద్, గోపి, నయీమ్, సంగీత, శిరిన్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నుంచి యువతను కాపాడాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలో గంజాయి, డ్రగ్స్, గుట్కా, మట్కా, పేకాట, ఆన్‌లైన్ గేమ్స్ అరికట్టాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు టీకానంద్‌తో కలిసి ఎస్పీ శ్రీనివాస్‌రావుకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో యువతను లక్ష్యంగా చేసుకొని కొంతమంది వ్యాపారస్తులు, మాదకద్రవ్యాల మాఫియా గంజాయి, డ్రగ్స్, గుట్కా మట్కా పేకాట, ఆన్‌లైన్ గేమ్, మట్కా వ్యాపారం చేస్తూ యువతను చెడుదారిలో నడిపిస్తున్నారన్నారు. వారి భారీ నుంచి యువతను కాపాడాలని, ఈ వ్యాపారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికే వీటిని నిషేధించాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ జిల్లాలో ఇది అధిక మొత్తంలో కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షురాలు కొరంగ మాలశ్రీ, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం నిఖిల్, జిల్లా కమిటీ సభ్యులు జాడి తిరుపతి పాల్గొన్నారు.

సిర్పూర్ అభివృద్ధికి కృషి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎంపీ గెడం నగేష్ అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు జన్మదినం పురస్కరించుకొని శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలోని పటేల్ గార్డెన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా బర్త్‌డే కేక్‌ను హరీష్‌బాబు కట్ చేశారు. అనంతరం గార్డెన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ నియోజకవర్గ సమస్యల పట్ల తనకు పూర్తి అవగాహన ఉందని, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు సూచనల మేరకు నియోజకవర్గంలోని అన్ని సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దివంగత పాల్వాయి పురుషోత్తంరావు ఈ నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, ఆయన వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న హరీష్‌బాబు కూడా నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో పోడు సమస్య అధికంగా ఉందని, ఇప్పటికే నియోజకవర్గంలో సుమారు 10 వేల ఎకరాల భూములను కాపాడుకున్నట్లు తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో 111 మంది రక్తదానం చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షులు సిందం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, ఆసిఫాబాద్ మాజీ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ అరిగెల మల్లిఖార్జున్, నాయకులు నీరటి సత్యనారాయణ, కొంగ సత్యనారాయణ, వీరభద్రచారి, కొండ్ర మనోహర్‌గౌడ్, దహెగాం మాజీ ఎంపీటీసీ రాపర్తి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగిఉండాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగిఉండాలని షీటీమ్ సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని చావార అకాడమీ పాఠశాలను సందర్శించారు. అక్కడి విద్యార్థినులకు షీటీమ్ పనివిధానంపై, సైబర్‌క్రైమ్‌పై అవగాహన కల్పించారు.

తాజా మాజీ జెడ్పీటీసీకి సన్మానం



నవతెలంగాణ-తాంసి

తాజా మాజీ జెడ్పీటీసీలు తాటిపెల్లి రాజు, భీంపూర్ జెడ్పీటీసీ కుమ్ర సుధాకర్ పదవీ కాలం శుక్రవారంతో ముగియడంతో వారికి తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన వివిధ పార్టీల సర్పంచులు ఎంపీటీసీ నాయకులు పూలమాల శాలువాతో ఆత్మీయ వీడ్కోలు సన్మానం చేశారు. మండలాల్లోని అన్ని గ్రామాలాభివృద్ధి కోసం వారి ప్రత్యేక నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, రైతులకు ఉపయోగపడే గ్రావెల్ రోడ్లు, కుల సంఘాల భవన నిర్మాణాల కోసం నిధులను కేటాయించి, అభివృద్ధి చేయడం జరిగిందని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు సదానందం, కృష్ణ, నారాయణ, అరుణ్, పరమేశ్వర్, ధనుంజయ్, సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో వైద్యశిబిరాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని మామిడిగూడ, వాన్వట్ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వైద్యశిబిరాలు నిర్వహించినట్టు డా.సర్ఫరాజ్ తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలున్నందున మామిడిగుడ బాలికల ఉన్నత పాఠశాలలో 46 మంది బాలికలకు జలుబు, దగ్గు, జ్వరం, దురద ఉన్న వారికి మందులను పంపిణీ అందజేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో అంకోలి వైద్యసిబ్బంది హెల్త్ సూపర్‌వైజర్ బొమ్మెత సుభాష్, మర్సుకొల లక్ష్మీబాయి, ఆరోగ్య కార్యకర్తలు ఇందుబాయి, ఈశ్వర్‌రెడ్డి, ల్యాబ్ టెక్నిషియన్ మడవి శ్రీనివాస్ ఆశాకార్యకర్తలు రుక్మిణి, మామిడిగూడ ప్రధానోపాధ్యాయులు సుగుణ, వాన్వట్ వార్డెన్ ప్రతిభ, విద్యార్థులు పాల్గొన్నారు.

'శ్మశానంలో దొంగలు పడ్డారు'

నవతెలంగాణ-తాంసి

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ఏర్పాటే కీలకమని ఎస్సై శివరాం అన్నారు. మండలంలోని ఘోట్కూరి గ్రామంలో రూ.15 వేల విలువగల గ్రామపంచాయతీ సబ్‌మెర్సిబుల్ మోటారు పైప్ సెట్‌ని గుర్తు తెలియని దొంగలు దొంగిలించగా, గ్రామస్తులు శుక్రవారం శ్మశాన వాటిక వైపు వెళ్లగా, అక్కడ విద్యుత్ మోటార్ కనబడకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు హమీద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాంసి ఎస్సై సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఇటీవల ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోయాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. మండలంలోని గ్రామాల్లో సీసీ కెమెరాలు చేసుకోవాలని సూచించారు. దొంగలను పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.

ప్రయివేట్స్ హాస్పిటల్స్ నిబంధనలు పాటించాలి

నవతెలంగాణ-మంచిర్యాల

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-2010 ప్రకారం జిల్లాలోని మల్టీ, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్, ల్యాబ్స్, స్కానింగ్ సెంటర్‌లు నిబంధనలు పాటించాలని స్టేట్ టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు డాక్టర్ రాజేశం తెలిపారు. శుక్రవారం జిల్లాలోని హాస్పిటల్స్ పర్యవేక్షణలో భాగంగా ముందుగా జిల్లా వైద్యాధికారి అనితతో సమావేశం ఏర్పాటు చేసి అనంతరం ప్రయివేటు హాస్పిటల్స్‌ను సందర్శించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్టేట్ లెవల్‌గా 7టీం లు ఏర్పడ్డాయని, ప్రతి ఒక్క టీం నెలకు ఒకసారి జిల్లాలోని ప్రయివేట్ హాస్పిటల్స్, స్కానింగ్ సెంటర్స్, ల్యాబ్‌లను సందర్శిస్తారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైన హాస్పిటల్స్‌ను నడిపిస్తే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో 245 ప్రయివేటు ఫెసిలిషియేషన్, 12 ఆయుష్‌తో కూడిన హాస్పిటల్స్ ఉన్నాయని, ఇంకా ఎవరైనా హాస్పిటల్ వివరాలు నమోదు చేసుకోకుంటే త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. అనుమతులులేని హాస్పిటల్ నిర్వాహకులకు నోటీసులు అందిస్తామని తెలిపారు. ప్రతి హాస్పిటల్‌లో పని చేసే వైద్యుల వివరాలు, అందించే సౌకర్యాలు, ఫీజు వివరాలు రిసెప్షన్ ఆవరణలో కనబడే విధంగా ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి అనిత, ఫయాజ్‌ఖాన్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సంయుక్త సంచాలకులు డాక్టర్ రాజేశం పాల్గొన్నారు.

ఎల్లో, రెడ్ కార్డు విధానాన్ని విరమించుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలోని ఉద్యోగుల పట్ల యాజమాన్యం క్రమశిక్షణ చర్యలు భాగంగా ఎల్లో కార్డు, రెడ్ కార్డ్ విధించే విధానాన్ని వెంటనే విరమించుకోవాలని సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఏరియా బ్రాంచ్ ఉపాధ్యక్షుడు పెట్టెం లక్ష్మణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విధానం క్రీడలకు పరిమితం సంఖ్యలో ఉండే సభ్యులకు మాత్రమే వర్తింస్తుందన్నారు. ఈ ఎల్లో కార్డు, రెడ్ కార్డు విధానం పరిశ్రమలలో ఎక్కడ కూడా ఉండదని, బొగ్గు పరిశ్రమలలో వివిధ హోదాలలో వివిధ వృత్తులు వాటికి సంబంధించిన కోడ్ ఆఫ్ డిసిప్లిన్ మాత్రమే వర్తిస్తుందన్నారు. ఈ విధానం వల్ల సింగరేణిలో పారిశ్రామిక అశాంతి ఏర్పడుతుందని, కావున ఈ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని అన్నారు. లేని యెడల కార్మిక శ్రేయస్సు దృష్టిలో ఉంచుకొని ఎంతటి పోరాటానికైనా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉంటుందని హెచ్చరించారు.

హాజరు శాతం పెంచాలి : విద్యాధికారి ప్రభాకర్

నవతెలంగాణ-కాసిపేట



పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచేలా చూడాలని ఎంఈఓ వాసాల ప్రభాకర్ సూచించారు. శుక్రవారం మండలంలోని పలు పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా లంబాడితాండ(ఎస్) ప్రైమరీ, హై స్కూల్ను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, హాజరు శాతం పెంచాలని సూచించారు. కస్తూర్బా పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. మోడల్ స్కూల్ను పరిశీలించి మధ్యాహ్న భోజన నిర్వాహణను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నెన్నెల లచ్చయ్య, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య, కేజీబీవీ ప్రిన్సిపాల్ సరిత, ప్రైమరీ హెచ్ఎం వాణికుమారి, సీసీఓ రాంబాబు పాల్గొన్నారు.

బొగ్గు బావులను వేలం వేస్తే ఊరుకోం

- సీపీఐ(ఎం), సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా
- కేంద్ర బీజేపీ ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం



సీపీఐ(ఎం), సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి బొగ్గు బావులను వేలం వేస్తే ఊరుకోమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. సీపీఐ(ఎం), సీఐటీయు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం మంచిర్యాల కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం కేంద్ర బీజేపీ ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంకె రవి మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావడం జరిగిందని, అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు దేశంలో ఉన్నటువంటి ప్రభుత్వ రంగ సంస్థలు, ఖనిజ సంపదను అన్ని కూడా కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు కారు చౌకగా అమ్మేస్తుందన్నారు. మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి గ్రామంలో ప్రజల ఆస్తి ఐన సింగరేణి బొగ్గు బావిని కూడా ఇప్పుడు ప్రయివేటు పెట్టబడుదాలకు, కార్పొరేట్లకు అమ్మడానికి బొగ్గు బావులను వేలం వేస్తుందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బొగ్గు బావుల ప్రయివేటీకరణపైన ఎలాంటి స్పందన లేదన్నారు. మంచిర్యాల జిల్లాలో ఉన్న ముగ్గురు ఎమ్మెల్యేలు, ఎంపీలు తక్షణమే స్పందించాలని, బొగ్గు బావుల ప్రయివేటీకరణ పైన పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. అదే విదంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని బొగ్గు బ్లాక్లను వేలంపాట ద్వారా ప్రయివేట్ కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలని బీజేపీ కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిదని, ప్రధానమైన ఉపాధి అవకాశాలు చూపెట్టే బొగ్గు రంగంలో కొత్త గనులు రాకపోతే భవిష్యత్తులో మంచిర్యాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నా ఆయా జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చే అవకాశం లేకుండా పోతుందన్నారు. ఒక వేళ ఈ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయివేటికరణ చేసే తప్పుడు నిర్ణయాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని లేదంటే రాష్ట్ర వ్యాపితంగా సీపీఐ(ఎం), సీఐటీయూ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు జి.ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యులు అశోక్, నగేష్, మధు, ఉమారాణి, సమ్మక్క, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు రామస్వామి, బాలాజీ, శ్రీనివాసు, కస్తూరి చంద్రశేఖర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకుల వేలానికి వ్యతిరేకంగా కలెక్టరేట్ ముట్టడి

సింగరేణిలో బొగ్గు బ్లాకుల వేలానికి వ్యతిరేకంగా కార్మిక క్షేత్రంలో బొగ్గు మంట మొదలైంది. శుక్రవారం బొగ్గు బ్లాక్ల వేలం వేయడాన్ని వ్యతిరేకిస్తూ ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ను ముట్టడించారు. మొదటగా సీఐటీయూ నాయకులు కలిసి వచ్చారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ మాట్లాడుతూ కంపెనీ మనుగడ కై కార్మిక వర్గం ఉద్యమించాలన్నారు. తెలంగాణలో ఉన్న బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జూలై 5 నుంచి 12 వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. 2015లో కేంద్ర ప్రభుత్వం ఎంఎండీఆర్ చట్టాన్ని మార్చి దేశంలో ఉన్న నూతన బొగ్గు గనులను ప్రభుత్వ రంగ లైన కోల్ ఇండియా, సింగరేణి కాలరీస్కు ఇవ్వకుండా ప్రయివేటు వారికి వేలం ద్వారా ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. పార్లమెంటులో ఎంఎండీఆర్ బిల్లుపై గత బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు తెలిపారని, అందుకే ఈ చట్టం కింద కేంద్ర ప్రభుత్వం తెలంగాణ లో ఉన్న నూతన బొగ్గు గనులను నామినేషన్ కింద ఇవ్వాల్సి ఉండగా ఇవ్వకుండా వేలం వేస్తుందన్నారు. తెలంగాణ బిడ్డగా ఉన్న కిషన్ రెడ్డి కేంద్ర మంత్రి పదవిలో ఉన్నందున వేలం వేయకుండా సింగరేణికి బొగ్గు గనులు దక్కే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం తో మిలాకతై సింగరేణికి నాలుగు బొగ్గు బ్లాక్లను తన అనుయాయులకు చెందె విధంగా సింగరేణిని వేలంలో పాల్గొనకుండా అడ్డుకుందని ఆరోపించారు. వేలంలో దక్కించుకున్న రెండు బొగ్గు బ్లాక్ లైన కోయగూడెం ఓసీపీ త్రీ, సత్తుపల్లి ఓసీపీ బీఆర్ఎస్కు చెందిన అరబిందో, అవంతిక అనే ప్రయివేటు కంపేనీలు ఇంత వరకు వాటిని ప్రారంబించలేదని వాటిని రద్దు చేయడంతో మిగతా గనులను సింగరేణికి ఇచ్చె విధంగా రాష్ట్ర ప్రభుత్వంకు లేఖ రాశామని తెలిపారు. తెలంగాణలో ఉన్న నూతన బొగ్గు గనులను వేలం వేయకుండా సింగరేణికి చెందే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జూలై 5 నుంచి 12 వరకు ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించడం జరిగిందని, ఈ ఆందోళన కార్యక్రమాల్లో, భాగంగా జూలై 8 నుంచి 12 వరకు సింగరేణి వ్యాప్తంగా అన్ని జీఎం కార్యాలయాల ఎదుట రిలే నిరాహారదీక్షలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, కేంద్ర కార్యదర్శి అక్బర్ అలీ, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శులు ఎస్ కే బాజీ సైదా, సలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జోగుల మల్లయ్య, రేగుంట చంద్రశేఖర్, కలందర్ అలీ ఖాన్ పాల్గొన్నారు.



సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా


భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటాలి



నవతెలంగాణ-నస్పూర్

భవిష్యత్ తరాల కోసం ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం 75వ వన మహోత్సవంలో భాగంగా శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఆర్కే-7 ఏజెంట్ కార్యాలయ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో అధిక సంఖ్యలో మొక్కలను నాటడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజులు, పెళ్లిరోజుల సందర్భంగా వారి నివాస ప్రదేశాలలో మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని ఎప్పటికి గుర్తుండేలా ఒక మొక్కను భూమాతిగా ప్రదానం చేయాలనీ సూచించారు. వృక్షో రక్షతి రక్షితః అని మహానుభావులు చెప్పిన విధంగా వృక్షాలను మనం రక్షిస్తే వృక్షాలు మనల్ని రక్షిస్తాయని, ఈ మహా యజ్ఞములో పాలు పంచుకున్న ప్రతి ఒక్క ఉద్యోగి భావి తరాలకు మంచి గాలి, నీరు అందించిన వారవుతారని, సంస్థ మొక్కలు నాటడంతో పాటు సింగరేణి విస్తరించి ఉన్న ఏరియాలలో పండ్ల మొక్కలు పూల మొక్కలను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా ఇన్చార్జి ఎస్ఓ టూ జీఎం ఏవీరెడ్డి, సీఎంఓఏఐ ఏరియా ప్రెసిడెంట్ ఏ వెంకటేశ్వర రెడ్డి, ఆర్కే-7 గ్రూప్ ఏజెంట్ మాలోత్ రాముడు, గని మేనేజర్ ఎన్ శ్రీధర్, గుర్తింపు సంఘం ఏరియా వైస్ ప్రెసిడెంట్ కొట్టే కిషన్ రావు, ఆర్కే-7 గని ఫిట్ సెక్రెటరీ బి రవీందర్ పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారిగా బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-వేమనపల్లి

మండలం పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల ప్రత్యేక అధికారిగా వి.ఉదయ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం పూర్తికావడంతో పరిపాలన సౌలభ్యం కోసం ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించారు. నూతన బాధ్యతలు చేపట్టిన ప్రత్యేక అధికారిని ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది శాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన ఆశ్రమ పాఠశాల, అమ్మ ఆదర్శ పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను పరిశీలించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని మండల ప్రత్యేక అధికారి ప్రధానోపాధ్యాయులకు సూచించారు. పాఠశాల పరిసరాలు తరగతి గదులను పరిశీలించారు. వర్షాకాలం నేపథ్యంలో ఎప్పటికప్పుడు పరిసరాలను గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం పెట్టాలన్నారు. అనంతరం పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఎంపిడిఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. వీరి వెంట ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, ఎంపీఓ అనిల్ కుమార్, ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు, హెచ్ఎం శ్రీధర్ రెడ్డి సీనియర్ సహాయకులు లక్ష్మీనారాయణ స్టాఫ్ నర్స్ శ్రీవాణి పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులు మంజూరు చేయాలి

- ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన ఉపాధ్యాయులు



నవతెలంగాణ-జైపూర్

మండలంలోని షట్ పల్లి గ్రామపంచాయతీలోని జిల్లా పరిషత్ పాఠశాలలో అదనపు తరగతి గదులు మంజూరు చేయాలని ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి తిరుపతి రాజుతో కలిసి పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని వినతి పత్రం అందజేశారు. తరగతి గదుల కొరత కారణంగా విద్యార్థులు ఆరుబయట విద్యాభ్యాసం చేస్తున్నందున్న తీరును వివరించారు. 5 తరగతులు నిర్వహించాల్సిన పాఠశాలకు కేవలం మూడు గదులు మాత్రమే ఉన్నందున మిగతా రెండు తరగతుల విద్యార్థులు వరండాలో చదువుకోవాల్సి వస్తుందని తెలిపారు. పాఠశాలకు సంబంధించి కంప్యూటర్లు, ల్యాబ్, లైబ్రరీ బుక్స్ ఉండడంతో విద్యార్థులను ఆరు బయట కూర్చోబెట్టాల్సి వస్తుందని తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనం బియ్యం, వంట సామాగ్రి భద్రపరచుకోవడం కూడా సమస్యగా మారిందని, వంటగదిలేక ఆరుబయట భోజనాలు వండాల్సి వస్తుందని తెలిపారు. ఆరుబయట విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులపై కోతులు దాడి చేస్తున్నాయని ఈ కారణంగా విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపలేని పరిస్థితి ఎదురైందని పేర్కొన్నారు. విద్యార్థుల ఇబ్బందుల గుర్తించి అవసరమైన మేరకు అదనపు గదులు నిర్మించి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాల సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తక్షణమే రెండు గదులు నిర్మించేందుకు ప్రపోజల్స్ తయారుచేసి ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో స్థానిక కాంగ్రెస్ నాయకుడు తిరుపతి రాజు, పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, నరహరి ఉన్నారు.

ఫర్టిలైజర్ షాప్ యజమానులు రశీదులు ఇవ్వాలి

నవతెలంగాణ-తాండూర్

ఫెర్టిలైజర్ షాపు యజమానులు విత్తనాలు ఎరువులు పురుగుమందుల కొనుగోళ్లకు సంబంధించిన రశీదులను రైతులకు ఇవ్వాలని జిల్లా వ్యవసాయాధికారి సురేఖ తెలిపారు. శుక్రవారం కన్నాల రైతు వేదికలో బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలోని ఎరువులు పురుగు మందులు, విత్తన దుకాణదారులకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యతలేని విత్తనాలు, కాలం చెల్లిన పురుగు మందులు రైతులకు అమ్మ రాదని తెలిపారు. నిబంధనలను అతిక్రమించి ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో సగటు కంటే తక్కువ వర్షపాతం నమోదు అవుతున్నందున రైతులకు స్వల్ప కాలిక వరి వంగడాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. విత్తనాలను విక్రయించేటప్పుడు రైతుకు అందించే రసీదుపై విత్తనాల తయారు తేదీ, మొలక శాతం, లాట్ నెంబర్ను తప్పకుండా నమోదు చేయాలన్నారు. మండలాలకు కేటాయించిన ఎరువులను పక్క మండలాలకు గాని జిల్లాలకు గాని సరపర చేయరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండూర్ వ్యవసాయ అధికారి కిరణ్మయి, బెల్లంపల్లి వ్యవసాయ అధికారి ప్రేమ్ కుమార్, కాసిపేట ఏఓ నందన కన్నాల ఏఈఓ నాగదీప్తి ఫెర్టిలైజర్ షాపు యజమానులు పాల్గొన్నారు.

సబ్సిడీపై బిందు, తుంపర సేద్యం పరికరాలు

నవతెలంగాణ-తాండూర్

తెలంగాణ ప్రభుత్వ సూక్ష్మ నీటి పారుదల పథకం కింద రైతులకు సబ్సిడీపై డ్రిప్ తుంపర సేద్యం పరికరాలు మంజూరు చేయడం జరుగుతుందని బెల్లంపల్లి ఉద్యానవన శాఖ అధికారి సిహెచ్ సుప్రజ తెలిపారు .నీటి సదుపాయం ఉన్న బెల్లంపల్లి క్లస్టర్ పరిధిలోని బెల్లంపల్లి కాసిపేట తాండూర్ భీమిని నెన్నెలా కన్నె పెల్లి రైతులు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఎస్సీ ఎస్టీ రైతులకు 100శాతం బిసి రైతులకు 90 శాతం పెద్ద రైతులకు 80% ప్రభుత్వం రాయితీ కల్పించిందన్నారు. అదేవిధంగా సబ్సిడీపై 23 యూనిట్ల తుంపర సేద్యం పరికరాలు 70% రాయితీపై అందించడం జరుగుతుందన్నారు ఆసక్తి గల రైతులు మీసేవా లో టీజీఎంఐపి సైట్ లో రిజిగ్రెషన్ చేసుకొని స్లిప్ తో పాటు అప్లికేషన్ పామ్ నింపి పట్టాపాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డ్, బ్యాంక్ బుక్, 1 బి కులదవీకరణ పత్రం తో పాటు పాస్ ఫోరీ సైజ్ ఫోటో లో అప్లికేషన్ పారాన్ని ఉద్యానవన శాఖ అధికారి సెల్ . 8977713955 ను సంప్రదించాలని కోరారు.

స్కావెంజర్ పోస్ట్కు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టు భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ ప్రభాకర్ తెలిపారు. కేజీబీవీలోని స్కావెంజర్ పోస్టుకు 18 నుంచి 45 ఏళ్ల లోపు వయోపరిమితి, ఏడవ తరగతి పాసై ఉండాలన్నారు. నివాస ధృవీకరణ పత్రాలతో పాటు ఏడవ తరగతి పాస్ సర్టిఫికెట్, బోనాఫైడ్ సర్టిఫికెట్లతో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. జూలై 10వ తేది సాయంత్రం నాలుగు గంటలలోపు మండల విద్యావ నరుల కేంద్రంలో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

గంగాపూర్ రైల్వేగేటు మూడు రోజులపాటు మూసివేత

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని రైల్వే గేట్ మూడు రోజులపాటు మూసి వేయబడుతుందని రైల్వే అధికారులు తెలిపారు. గంగాపూర్, నంబాల, తుంగెడ, నారాయణపూర్, కిష్టాపూర్, జక్కులపల్లి, మాధవాయిగూడ, పోతేపెల్లి, లక్ష్మంపూర్ గ్రామ ప్రజలు ఈ నెల 6 నుంచి 8 వరకు మూడవ లైన్ మరుమత్తులు కారణంగా మూడు రోజులపాటు రైల్వే గేట్ మూసి వేయబడుతుందని పలు గ్రామాల ప్రజలు సహకరించవలసిందిగా కోరారు.

ప్రతి ఉద్యోగి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



నవతెలంగాణ-నస్పూర్

ప్రతి ఒక్క ఉద్యోగి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఉపరితల గనిలో జీవీఆర్ కంపెనీ కాంట్రాక్టు ఉద్యోగులకు డీవై.సీఎంఓ డాక్టర్ రమేష్ బాబు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించగా ముఖ్య అతిథిగా జీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పని చేస్తున్న ప్రతి ఒక్క కాంట్రాక్టు ఉద్యోగికి తమ ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో ఈ వైద్య శిబిరం ద్వారా తెలుస్తుందని, ఏమైనా జబ్బులు ఉన్నట్లయితే వాటిని నివారించడానికి తగిన మందులు సంస్థ అందజేస్తుందన్నారు. ప్రతి ఒక్క కాంట్రాక్టు ఉద్యోగి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అలాగే ఉద్యోగులు తమ ఆహార అలవాట్లను ఎప్పటికప్పుడు గమనిస్తూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ సంస్థ బాధ్యతగా భావించి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా డీజీఎం పర్సనల్ అరవింద రావు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు హెచ్డీఎఫ్సీ బ్యాంకుతో కంపెనీ ఒప్పందం చేసుకుందని బ్యాంకు ద్వారా లభించే ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. అలాగే సంస్థ నుండి విడుదలైన సర్క్యులర్ ను జీవీఆర్, సీఆరఆర్ కంపెనీ ప్రతినిధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు కె వెంకటేశ్వర్ రెడ్డి, ఇన్చార్జ్ ఎస్ఓ టూ జీఎం ఏవీ రెడ్డి, శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్టు ఆఫీసర్ టి శ్రీనివాస్, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఏరియా రక్షణాధికారి శ్రీధర్ రావు, గని మేనేజర్ బ్రహ్మాజీ, ప్రాజెక్టు ఇంజనీర్ చంద్ర శేఖర్, డాక్టర్ లోక్ నాథ్, గని రక్షణాధికారి శ్రీనివాస్, సంక్షేమ అధికారి శంకర్, పిట్ కార్యదర్శి లచ్చన్న పాల్గొన్నారు.

శాంతిభద్రల పరిరక్షణకే కార్డెన్ సెర్చ్

- తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి

నవతెలంగాణ-తాండూర్



శాంతి భద్రతల పరిరక్షణకే కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి అన్నారు. శుక్రవారం తెల్లవారుజామున మాదారం పోలీస్స్టేషన్ పరిధిలోని ఎంవీకే-3 ఇంక్లైన్ గ్రామంలో పోలీసు సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాకు గ్రామస్తులు సహకరించవద్దని కోరారు. గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని నేర నియంత్రణలో భాగస్వాములు కావాలన్నారు. గంజాయి మత్తు పదార్థాలు సేవించిన అమ్మిన నేరమని యువత వీటికి బానిసగా మారి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. తాండూర్ సర్కిల్ పరిధిలో వాహన తనిఖీ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని అట్టి సమయంలో వాహనానికి సంబంధించిన పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. నంబర్ ప్లేట్ తప్పనిసరిగా కనబడే విధంగా అమర్చుకోవాలన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపరాదని ట్రిబుల్ రైడింగ్ చేయరాదన్నారు. సరైన అనుమతులు లేని 50 ద్విచక్ర వాహనాలతో పాటు పది ఆటోలను గుర్తించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎస్ఐ కిరణ్ కుమార్ పాల్గొన్నారు

పంటలకు సాగునీరు అందించాలి

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని మహమ్మదాబాద్ గ్రామ సమీపాన 18బీ కెనాల్ వద్ద తూము పూర్తిగా చెడిపోయిందని వెంటనే మరమ్మతులు చేయించి 200 ఎకరాలకు నీరు అందించాలని ఆ గ్రామ మాజీ సర్పంచ్ చునారుకార్ లక్ష్మణ్ కోరారు. గతంలో ఎంపీడీఓ కార్యాలయంలో, సర్వసభ్య సమావేశంలో ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడంలేదని సర్పంచ్ వాపోయారు. వెంటనే రిపేరు చేయించాలని డిమాండ్ చేశారు. రిపేరు చేయకుంటే దాని ఆయకట్టు కింద ఉన్న 200 ఎకరాలు పంటలు పండే అవకాశం లేదన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు వెంటనే స్పందించి, వెంటనే ఆ తూమును రిపేరు చేయించి రైతులను ఆదుకోవాలని ఆ గ్రామ రైతులు కోరుతున్నారు.

వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్ బేసిక్ ఉచిత శిక్షణ

నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ పరిసర ప్రాంతాలకు చెందిన వారికి సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్ బేసిక్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఎస్టీపీపీ హెచ్ఓడీ ఒక ప్రకటనలో తెలిపారు. కోల్‌బెల్ట్ ఏరియా పరిధి నిరుద్యోగ యువకులకు సింగరేణిలో గల ఆఫ్ లోడింగ్ ఏజెన్సీస్‌లో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడం కోసం అర్హులైన అభ్యర్థుల నుండి ధరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్‌గా ఒక బ్యాచ్‌లో ఒక క్యాడర్‌లో 50 మందికి మూడు నెలల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండి హెవీ గూడ్స్ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు అనుభవం, 18 నుండి 35 సంవత్సరాలు వయస్సున్న వారు అర్హులని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వారికి వయస్సులో 5 సంవత్సరాలు సడలింపు ఉంటుందని, అభ్యర్థులు శారీరక ఫిట్‌నెస్ కలిగివుండాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 10 లోపు వారికి దగ్గరలో గల ఎంటీటీసీలో ధరఖాస్తులు అందజేస్తూ స్టడీ సర్టిఫికెట్స్, ఎస్సెస్సీ ఉత్తీర్ణత హెవీ వేకిల్ లైసెన్స్ ఆధార్ కార్డు రెండు పాస్‌పోటోలతో ధరఖాస్తు అందజేయాలని కోరారు.

వర్షాకాలం పంట వివరాలు నమోదు

నవతెలంగాణ-లోకేశ్వరం



మండలంలోని పాట్పెల్లి, ఎడ్దూర్ గ్రామాల్లో వానాకాలం పంట వివరాలను శుక్రవారం వ్యవసాయ విస్తరణ అధికారి ఉమేష్ నమోదు చేశారు. ఈ సందర్భంగా రైతు పేరు, పట్టా పాస్ బుక్ సర్వే నంబర్, ఎన్ని ఎకరాల్లో ఏ పంట వేశారనే తదితర వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు గంజుగాం సోమనాథ్, బ్యాగరి గణేష్, పుల్లోల సత్యనారాయణ, బండారి దేవేందర్ ఉన్నారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-జన్నారం

ఎస్సీ తెగలో ఉన్న ఉపకులమైన నేతకాని కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నేతకాని సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్, విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు నేతకానియులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు ఆ హామీని నెరవేర్చలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నేతకాని జనాభా గోదావరి పరీవాహక ప్రాంతమైన ఖమ్మం నుండి నిజామాబాద్ జిల్లా జుక్కల్ వరకు సుమారు ఇరవై లక్షల పైచిలుకు జనాభా కలిగి ఉన్నప్పటికీ ఎన్ని ప్రభుత్వాలు మారినా నేతకాని కులస్తులను విస్మరిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి నేతకానిలకు ఇచ్చిన హామీ నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.వేయి కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నా మన్నారు. నేతకనిలకు నామినేటెడ్ పదవులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాన్నారు. ఈ కార్యక్రమంలో నేతకాని మహర్ సంఘం జిల్లా నాయకులు జాడి గంగాధర్, మండల అధ్యక్షులు రత్నం లక్ష్మణ్, మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు జాడి వెంకట్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్కులు, పలుకలు పంపిణీ



నవతెలంగాణ,జైపూర్

మండలంలోని ఇందారం గ్రామ పంచాయతీ దొరగారిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం నోటు బుక్కులు, పలకలు, వాటర్ బాటిల్స్‌తో పాటు పాఠశాలకు అవసరమైన స్టేషనరీ వస్తువులు అందజేశారు. గత 13 సంవత్సరాల క్రితం దత్తత తీసుకున్న దొరగారి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రతి సంవత్సరం వారి చదువుకు అవసరమైన నోట్ బుక్కులు ఇతర వస్తువులు సమకూర్చుతున్నారు. ఈ క్రమంలో లయన్స్‌క్లబ్ మంచిర్యాల అధ్యక్షుడు లయన్ బాల్‌మోహన్ ఆధ్వర్యంలో సీనియర్ లయన్ మధుసూదన్‌రెడ్డి సహాయ సహకారంతో విద్యార్థులకు వస్తువులు పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లితండ్రులపై ఆర్థిక భారం పడకుండా తమవంతుగా కొంత అన్నట్లు సహకారం అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బాల్ మోహన్, ప్రోగ్రాం చైర్ పర్సన్ మదుసూధన్, సెక్రెటరీ కర్నూరి చంద్రమౌళి, ట్రెజరర్ వెంకటేశ్వర్లు, సీనియర్ లయన్ మెంబర్స్ వినయ్‌కుమార్, హన్మంతరావు, అనిల్ కుమార్, నాగేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమతి పాల్గొన్నారు.

ఏఎస్సైకి అంతిమ వీడ్కోలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



విధుల్లో ఉండగా గుండెపోటుతో ఓ ఏఎస్సై మృతి చెందిన విషాద ఘటన గురువారం చోటుచేసుకుంది. హైదరాబాద్‌లోని టోలిచౌక్‌లో ఉంటున్న ఆదిలాబాద్ జిల్లాకు చెందిన యూనస్ ఖాన్ సీఐడీలో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక కేసులో కోర్టుకు హాజరు కాని నిందితుడి కోసం ఎస్సై, కానిస్టేబుల్‌తో కలిసి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి గౌతమీ, భీమవరం వెళ్లాల్సి ఉంది. మెహిదీపట్నం నుంచి రూట్ 5కే సెట్విన్ బస్సులో యూనస్ ఖాన్ సికింద్రాబాద్ బయలుదేరాడు. బస్సు వద్దకు వచ్చే సరికి గుండెపోటు రావడంతో సీటులో నుంచి జారి కిందపడ్డాడు. ఇతర ప్రయాణికులు సీపీఆర్ చేయడంతో పాటు సికింద్రాబాద్ స్టేషన్ వద్దకు తీసుకుని వచ్చి పోలీసులు, 108 సిబ్బందికి సమాచారం అందించారు. 108 సిబ్బంది వచ్చి పరీక్షించి, అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన ఏఎస్సై యూనస్ ఖాన్ 1989 బ్యాచ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలుచోట్ల విధులు నిర్వర్తించారు. కాగా అంత్యక్రియలు శుక్రవారం ప్రార్థనల అనంతరం స్థానిక ఈద్గా శ్మశాన వాటికలో అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. అంత్యక్రియలకు ముందు జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి ఆయనకు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. స్థానిక శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించి, మూడు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపి నివాళులర్పించారు. అంత్యక్రియల్లో హైదరాబాద్ సీఐడీ ఎస్పీ భూక్యా రాంరెడ్డి, ఆదిలాబాద్ మహిళా పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాస్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల పోలీసు సంక్షేమ సంఘం అధ్యక్షులు పెంచాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి జూనియర్ హాకీ పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాకు చెందిన కొడప ప్రదీప్ కుమార్, వెట్టి సుదర్శన్ దక్షిణ భారత జాతీయ స్థాయి జూనియర్ హాకీ పోటీలకు ఎంపికయ్యారని జిల్లా హాకీ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. గోవర్ధన్ రెడ్డి, కె. పార్థసారథి తెలిపారు. ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు ఏపీలోని పులివెందులలో నిర్వహించే హాకీ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఉట్నూరు గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలకు చెందిన శేఖర్ జట్టు కోచ్‌గా వ్యవహరిస్తారని వివరించారు. వీరిని గిరిజన సంక్షేమ శాఖ డీడీ దిలీప్ కుమార్, సీనియర్ క్రీడాకారులు డేవిడ్, జే.రవీందర్, ఖేలో ఇండియా కేంద్రం హాకీ కోచ్ శ్రీనివాస్ అభినందించారు.

ఫ్రైడే డ్రై డే కార్యక్రమం

నవతెలంగాణ-లోకేశ్వరం

సీజనల్ వ్యాధుల నివారణకు ఇంటి ఆవరణ, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇన్‌చార్జి ఎంపిడిఓ రమేష్ అన్నారు. శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వార్డుల్లో పర్యటించి పాత కుండలు, టైర్లలో నిల్వ ఉన్న నీటిని సిబ్బందితో పారబోయించారు. ఇంటి పరిసరాల్లో మురుగు గుంతలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినయ్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

నవతెలంగాణ,జైపూర్

ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామితో కలిసి శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన వనమహోత్సవంలో పాల్గొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో చెట్లు నాటారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ సభ్యునిగా మొట్టమొదటి సారి చెన్నూర్ నియోజకవర్గం పరిధి జైపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులతో కలిసి వనమహోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు. విద్యార్థులుగా ఎంజాయి చేసినా చదువుల పట్ల ఆసక్తి పెంచుకుని భవిష్యత్తులో గొప్పగా స్థిరపడటం కోసం కృషి చేయాలని కోరారు. తమ పిల్లలు మంచి స్థాయికి ఎదిగినపుడే తల్లితండ్రులు, కుటుంబ సభ్యులు ఆనందిస్తారని అన్నారు. ఎంపీగా నియోజవర్గానికి అత్యధిక నిధులు తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు. ఇప్పటికే కేంద్ర మంత్రులను కలిసి అభివృద్ధి పనులకు ఆటంకంగా మారిన అటవీ అనుమతులు ఇవ్వాలని కోరిన సంధర్భంలో వారు సానుకూలంగా స్పందిచారని గుర్తు చేశారు.

తాగు నీటి సమస్య పరిష్కరించలే..

తెలంగాణ రాష్ట్రాన్ని పదేండ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్‌భగీరథ పేరుతో ప్రజలను మభ్యపెట్టింది తప్పా మంచినీటి సమస్యకు పరిష్కారం చూపలేకపోయిందని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి విమ్మర్శించారు. అసెంబ్లీ ఎన్నికలకు గ్రామాల్లో తిరుగుతున్నప్పుడు ప్రజలు తాగు నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తమ దృష్టికొంచ్చిందన్నారు. స్థానికుల అభ్యర్థన మేరకు బోరు బావులు ఏర్పాటు చేసి వేసవిలో ప్రజల దాహర్తి తీర్చామని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం శిథిలమైనందున ప్రత్యామ్నయంగా కార్యాలయం ఏర్పాటుకు రూ. 10 లక్షలు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం జైపూర్ పాఠశాలలో మూత్రశాలలు నిర్మించేందుకు కలెక్టర్ దీపక్ కుమార్‌తో మాట్లాడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కుమార్ దిలీప్‌తో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ ఫయాజోద్దీన్, జిల్లా కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

భీమారం మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం నిర్మాణంతో పాటు రూ. 1.60 కోట్లతో ఏర్పాటు చేయనున్న 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. భీమారం, నర్సింగాపూర్‌లలో మొక్కలు నాటారు.





రాజకీయ నాయకులకు పదవీ విరమణ ఉండదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



అధికారులకు పదవీ విరమణ, బదిలీ ఉంటుందని, రాజకీయ నాయకులకు ఉండవని పదవీ కాలం ముగిసిన కూడా ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కరం కోసం కృషి చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జెడ్పీ పాలకవర్గం పదవీ కాలం ముగియడంతో శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. మాజీ జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్‌తో పాటు జెడ్పీటీసీలు, కోఆప్షన్ సభ్యులను శాలువాతో సత్కరించి మెమొంటోలను అందించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీల ఎనిమిది నెలల గౌరవ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని ఇప్పించేలా చూడాలని కలెక్టర్‌ను కోరాగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు కలిస్తేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ప్రజలకు కూడా ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందించడానికి వీలుంటుందన్నారు. ఐదేండ్ల పాటు జెడ్పీ పాలకవర్గం మంచి పాలన అందించిందన్నారు. బిల్లులు, మంజూరైన ఇతర పనులను పూర్తి చేయాడానికి తన వంతుగా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఇక నుంచి ప్రభుత్వ కార్యక్రమాల్లో మాజీలైన కూడా ఆహ్వానిస్తామన్నారు. ప్రజాక్షేత్రంలో ఉంటూ వారి సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు.

ప్రతి సభ్యుడు ప్రజల సమస్యలపైనే నిలదీశారు..

ఈ సందర్భంగా మాజీ జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ మాట్లాడుతూ ఐదేండ్ల కింద 2019 జులై 5న ఇదే జిల్లా పరిషత్ జెడ్పీటీసీలు, జెడ్పీచైర్మెన్‌గా తను ప్రమాణ స్వీకరం చేశామని తెలిపారు. ఐదేండ్ల పాటు సర్వసభ్య సమావేశంలో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్క సభ్యుడు ప్రజ సమస్యలపైనే నిలదీశారని అన్నారు. వ్యక్తిగతంగా ఎన్నడూ మాట్లాడలేదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారం ఎన్నటికి మరిచిపోలేనిదన్నారు. ప్రజల కోసం పని చేసే వారికి ఎన్నడు కూడా విరమణ ఉండదని, ప్రజాక్షేత్రంలో మరింత ముందుకు సాగుతూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రత్నమాల, డిప్యూటి సీఈఓ, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి ఉన్నారు.

శాఖల వారిగా లక్ష్యాలను పూర్తి చేయాలి

75వ వజ్రోత్సవ వనమహోత్సవ కార్యక్రమం కింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా ఆయా శాఖలు కృషి చేయాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సంబంధిత శాఖ అధికారులతో డిస్ట్రిక్ట్ లెవెల్ మానిటరింగ్, కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవం కార్యక్రమాన్ని జిల్లాలో వంద శాతం లక్ష్యాలను పూర్తి చేయుటకు శాఖల వారీగా ప్రణాళికలు రూపొందించి మొక్కలు నాటే ప్రదేశాలను గుర్తించాలని అన్నారు. ప్లాంటేషన్ పూర్తయిన తర్వాత నాటిన మొక్కల పూర్తి వివరాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని అన్నారు. మొక్కలు నాటే స్థలాన్ని మూడు రోజుల్లో పరిశీలించి, ఆ స్థలంలో ఎన్ని మొక్కలు నాటవచ్చో వివరాలూ పూర్తి నివేదిక సమర్పించాలన్నారు. జిల్లాలో ఉన్న 468 జీపీల్లో ఉన్న నర్సరీల్లో ఉన్న స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వనమహోత్సవం ద్వారా వివిధ శాఖలకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయుటకు అటవీశాఖ అధికారులు నిత్యం సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ, నిర్దేశిత లక్ష్యాలను అధిగమించేందుకు చొరవ చూపాలని అన్నారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం అయినందున విరివిగా మొక్కలు నాటాలని, దీనిని ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని, నిర్ణీత గడువు లోపు లక్ష్యం పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లో పట్టణాల్లో పూలు, పండ్ల మొక్కలను అందచేయాలని సూచించారు. పచ్చదనం, పర్యావరణ పరిరక్షణతో ముడిపడిన వనమహోత్సవ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యతనిస్తూ లక్ష్యాల సాధనకై పకడ్బందీ ప్రణాళికలు రూపొందించుకుని అంకితభావంతో కృషి చేయాలన్నారు. జిల్లాలో అన్ని శాఖలు, మున్సిపల్ పరిధిలో కలిపి 46 లక్షల లక్ష్యం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో అటవీశాఖాధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, డీఆర్డీఓ సాయన్న, సంబంధిత శాఖల అధికారులు, ఎంపీడీఓ, డీపీఎంలు, ఏపీఎంలు, ఎంపీఓలు, డ్వామా ఏఓలు పాల్గొన్నారు.

బొమ్మల పుస్తకాలతో విద్యార్థులకు పఠనాసక్తి



నవతెలంగాణ-నిర్మల్

బొమ్మల పుస్తకాలతో విద్యార్థుల పఠనాసక్తి పెరుగుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రూమ్ టు రీడ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో డీకోడబుల్ (బొమ్మల) పుస్తకాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలోని దాదాపు తొమ్మిది వేల మంది విద్యార్థులకు బొమ్మల పుస్తకాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఒకటి, రెండవ తరగతిలోని ప్రతి విద్యార్థికి తెలుగు చదవడం, రాయడం సులభతరం చేయడానికి బొమ్మల పుస్తకాలు ఎంతో దోహదం చేస్తాయని అన్నారు. పుస్తకాలను ఉచితంగా అందిస్తున్న రూమ్ టూ రీడ్ ఇండియా సంస్థ ప్రతినిధులను అభినందిస్తూ, ఆగష్టు నెలలో మండలానికి ఒకటి చెప్పున ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో మోడల్ గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలనీ సూచించారు. కార్యక్రమంలో డీఈఓ రవీందర్‌రెడ్డి, రూమ్ టూ రీడ్ ఇండియా సంస్థ రాష్ట్ర మేనేజర్ నరసింహచారి, సంస్థ ప్రాజెక్టు అధికారులు నితిన్ కుమార్, ప్రవీణ్ కుమార్, గోనె రవి, అకడమిక్ మానిటరింగ్ అధికారి నర్సయ్య సిబ్బంది పాల్గొన్నారు.


అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

నవతెలంగాణ-జైపూర్

మండల కేంద్రంలో గల ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలతో పాటు ప్రాథమికోన్నత పాఠశాలలో అసంపూర్తిగా మిగిలివున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రాన్ని సంధర్శించిన కలెక్టర్ జిల్లా పరిషత్ పాఠశాల తరగతి గదులు ప్రాథమికోన్నత పాఠశాలలో నిలిచిపోయిన పనులను పరిశీలించారు. మన ఊరు మన బడి కార్యక్రమం ద్వార నిర్మిచాల్సిన తరగతి గదులు, మూత్రశాలు, డైనింగ్ హాల్, విద్యుత్ సరఫరా పనులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. మొదటి దశలో విడుదలైన నిధులతో పాటు రెండవ దశలో చేపట్టిన పనులకు సంబంధించిన రికార్డులు స్థానిక ఎంపీడీఓ అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

జెడ్పీ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-నిర్మల్



జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జెడ్పీ పాలక వర్గం పదవీ కాలం పూర్తి కావడంతో కలెక్టర్‌ను ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి కలెక్టర్ జిల్లా పరిషత్ కార్యాలయానికి చేరుకొని బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ గోవింద్, ఇతర అధికారులు కలెక్టర్‌కు స్వాగతం పలికి పుష్ప గుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్యాలయ విభాగాలను పరిశీలించి, అధికారులకు, సిబ్బందికి కలెక్టర్ పలు సూచనలు చేశారు.

ఆశ్రమ పాఠశాలల్లో పనులు వెంటనే పూర్తి చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఆశ్రమ పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా అన్నారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నాలుగు జిల్లాల ఆశ్రమ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న వసతి భవనాలు, తరగతి గదులు, వంట గదులు, పహరి గోడలను, మరుగుదొడ్లలని పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. వర్ష కాలం నేపథ్యంలో దెబ్బతిన్న ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉండే ప్రాంతాల రోడ్లను బ్రిడ్జిలను త్వరగా పూర్తి చేసి ప్రారంభిచాలని అన్నారు. అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ, భవనాలను కూడా పూర్తి చేయాలని సూచించారు.పెండింగ్‌లో ఉన్న బిల్లు త్వరగా చెల్లించే విధంగా చూస్తానని అన్నారు. ఈ సమావేశంలో ఈఈ రాథోడ్ భీమ్‌రావు, డీఈలు శివప్రసాద్, నిరంజన్, శబాష్ అమ్మద్, సంతోష్, నాలుగు జిల్లా ఏఈలు ఉన్నారు.

'అక్రమ అరెస్టులకు భయపడేది లేదు'

నవతెలంగాణ-జన్నారం

రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల విస్మరించి ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఉద్యమించే వారిని అక్రమ అరెస్టులు చేస్తే భయపడేది లేదని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అలసత్వాన్ని నిరసిస్తూ నిరుద్యోగులు వివిధ విద్యార్థి సంఘాల పిలుపు మేరకు కలెక్టరేట్లు, టీఎస్పీఎస్సీ భవన్ ముట్టడించేందుకు వెల్తున్న వారిని ముదస్తు అరెస్టులు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. తెలంగాణ నేతకాని మహర్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత, బీజేవైఎం మండల అధ్యక్షుడు ముడుగు ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం తెల్లవారుజామునే తెలంగాణ నేతకాని విద్యార్థి సంఘం బీజేవైఎం ఎస్ఎఫ్ఐ పిడిఎస్యు నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. ప్రజా వ్యతిరేకపాలన సాగిస్తూ ఏడు నెలల వ్యవధిలోనే ప్రభుత్వం తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్నదని దుయ్యబట్టారు. ఇలాంటి అక్రమ అరెస్టులకు విద్యార్థి ఉద్యమకారులు భయపడేది లేదని ప్రభుత్వం ఏదైతే నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జన్నారం మండల వివిధ విద్యార్థి సంఘ నాయకులు చంద్రశేఖర్, పవన్, నితిన్, మనీష్ అరెస్టు అయ్యారు.

ఉద్యోగోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయురాలికి ఘన సన్మానం

నవతెలంగాణ-ముథోల్

మండలంలోని తరోడ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో పనిచేసిన ప్రధానోపాధ్యాయులు అరుంధతి పదోన్నతిపై బాసర జిల్లా పరిషత్ పాఠశాలకు వెళ్లారు. దీంతో శుక్రవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు అరుంధతికి పూలమాల వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆమె చేసిన సేవలను పలువురు అభినందించారు. నూతంగా ఉపాధ్యాయులుగా వచ్చిన వద్నం వీణను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బండారి గంగాధర్, మాజీ సర్పంచ్ శ్వేత రవికిరణ్‌గౌడ్, ఉపాధ్యాయురాలు నీలిమ, పాఠశాల చైర్మెన్ భూషి రాధ, గ్రామస్తులు చిన్నన్న, చిన్నామోనాజీ పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

నవతెలంగాణ-జన్నారం



రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లూరి విజయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.రాష్ట్రంలో అన్ని శాఖలలో ఖాళీగా ఉన్న అన్ని రకాల ఉద్యోగులను భర్తీ చేయాలన్నారు. అదేవిధంగా జాబ్ క్యాలెండర్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం నిరుద్యోగులకు అనేక రకాల హామీలు నెరవేర్చక ఉద్యోగాలు అడిగిన వారిపై అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినాక కూడా గత పాలకుల లాగానే నిరుద్యోగులకు మొండి చేయి చూపెడుతున్నారన్నారు. ప్రభుత్వాలు నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యం వహించడం వల్ల పేద కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆ ఆత్మహత్యలకు కారణం నేటి కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఎద్దేవా చేశారు. వెంటనే నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించకపోతే పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు శివాజీ, వినోద్, ప్రభాస్, ప్రవీణ్, చిన్న పాల్గొన్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం రిటైన్ గదులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రయాణికుల సౌకర్యార్థం ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌లో రిటైన్ గదులను అందుబాటులోకి తీసుకొచ్చామని దక్షిణ మధ్య రైల్వే నాందేడ్ డివిజన్ అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ ఎస్.సుబ్బారావ్ అన్నారు. గుడ్ ఫుడ్ క్యాటరింగ్ సర్వీసెస్, ఇండియన్ రైల్వే క్యాటరింగ్, టూరిజం కార్పొరేషన్ సంయుక్తంగా నిర్వహించే ఆ గదులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. గదులను పరిశీలించి ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా .సుబ్బారావ్ మాట్లాడుతూ విశ్రాంతి, బస చేయాలనుకునే వారి కోసం అన్ని హంగులు, వసతులతో గదులను ఏర్పాటు చేశామన్నారు. రిటైనింగ్ గదుల్లో బస చేసే ప్రయాణికుల సౌలభ్యలతో పాటు భద్రత ఉంటుందన్నారు. వీటిని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమలో నాందేడ్ స్టేషన్ ఆఫీసర్ రాహుల్ యాదవ్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ పవార్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సంజయ్ పాస్వాన్ పాల్గొన్నారు.

